
ఓం నమో వేంకటేశాయ!
తిరుమల తిరుపతి దేవస్థానములు
శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్
SVBC TTD
Sri Venkateswara Swamivaru
Sri Venkateswara Bhakti Channel, Tirupati
గోవిందం పరమానందం
శ్రీవారి నిత్య సేవలు - పూజా విధి


ఓం నమో వేంకటేశాయ!
శ్రీ కనుమూరి బాపిరాజు, M.P.
ఛైర్మన్, పాలకమండలి, తి.తి.దే
శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, I.A.S.
కార్యనిర్వహణాధికారి, తి.తి.దే
ప్రచురణ:
తిరుమల తిరుపతి దేవస్థానములు

# గోవిందం - పరమానందం

## (శ్రీవారి నిత్యసేవలు - పూజావిధి)

T T D

ప్రచురణ

**శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2012**

**గోవిందం - పరమానందం**

**(శ్రీవారి నిత్యసేవలు - పూజావిధి)**

పరిష్కర్త : డా. వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు,
టిటిడి ఆగమ సలహాదారు

రచన, కూర్పు : జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

సహాయకులు : దామా మురళీకృష్ణ, చివుకుల శ్రీనివాస్

ప్రథమ ముద్రణ : 2012

ప్రతులు :

వెల : అమూల్యం

ప్రచురణకర్త :

శ్రీ యల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.యస్.,

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

డి.టి.పి. :

శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్

ముద్రణ :

తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రణాలయం

తిరుపతి

# సందేశం

**(శ్రీ కనుమూరి బాపిరాజు, చైర్మన్, పాలకమండలి, తితిదే)**

గోవిందం–పరమానందం అనే ఈ చిన్నపుస్తకం స్వామివారి నిత్యసేవలను, వారోత్సవాలను చక్కగా కళ్లకు కట్టినట్లు వ్యావహారిక భాషలో సామాన్య జనులకు అర్థమగు రీతిలో వివరించింది. భక్తిచైతన్యం ప్రతి భక్తునికీ అవసరం. భక్తితో చతుర్విధ పురుషార్థాలూ సాధించవచ్చు.

బంగారువాకిలి ప్రాకారంలో ఆనందనిలయంలో జరిగే సుప్రభాతం మొదలగు సేవలను నమూనా ఆలయంలో చిత్రీకరించి భక్తకోటికి అందించాలని మా పాలకమండలి నిర్ణయించింది. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా 30.01.2012 రథసప్తమి పర్వదినాన ఉ. 4 గం.లకు సుప్రభాతసేవతో పాటు శ్రీవారి నిత్యపూజావిధిని ప్రసారం గావించడం జరుగుతుంది.

ఆధ్యాత్మికభక్తిచైతన్యంతో అందరూ శ్రీవేంకటేశ్వర స్వామి అనుగ్రహాన్ని సంపాదించి కృతకృత్యులు కావాలనే ప్రయత్నంలో భాగంగా పూజావిధానం, గోవిందనామావళి ఈ చిన్నపుస్తకంలో కూర్చబడ్డాయి. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని శ్రీవేంకటేశ్వరభక్తిఛానల్ ఆశయాన్ని నెరవేర్చగలరని ఆశిస్తున్నాము.

ఈ చిన్నపుస్తకం ద్వారా అత్యంతమైన ఆనందాన్ని పొందుతున్నాను.

కనుమూరి బాపిరాజు
చైర్మన్, పాలకమండలి, తితిదే

# సందేశం

**(శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, I.A.S., కార్యనిర్వహణాధికారి, తితిదే)**

సకలలోకాధిపతి దేవతాసార్వభౌముడు సృష్టి స్థితి లయకర్త అగు శ్రీవేంకటేశ్వరస్వామి వారి యొక్క దర్శనభాగ్యమే ఈ కలియుగంలో ముక్తిమార్గం. తిరుమల క్షేత్రంలో అర్చామూర్తిగా వెలసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారియొక్క దివ్యధామంలో అనునిత్యం అనేక ఉపచారాలతో ఆగమ సూత్రాలతో వైదికంగా సుప్రభాతసేవ మొదలుకొని ఏకాంతసేవ వరకూ గల నిత్యోత్స వాలు, వారోత్సవాలు, సంవత్సరోత్సవాలు సాంప్రదాయబద్ధంగా ఆచరింపబడుతూ ఉన్నాయి.

ఈ ఉత్సవాలలో కొన్నింటిని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం కావిస్తున్నాం. ఆనందనిలయంలో నిర్వ హించే నిత్యసేవలను, ఆయా వారాల్లో సేవలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు సాంప్రదాయరీత్యా సాధ్యం కాదు. అందుచేత నమూనా దేవాలయంలో సుప్రభాతాది సేవలను చిత్రీకరించి భక్తులందరికీ అందరికీ అందించాలనే మాచిన్నప్రయత్నమే ఈ **'గోవిందం- పరమానందం'.** దీనితోపాటు స్వామివారి నిత్య పూజావిధినికూడా సంప్రదాయబద్ధంగా ప్రతి భక్తుడు ఆచరించి తరించాల్సిందిగా కోరుతున్నాను. ఈ పుస్తకం ద్వారా ప్రతి భక్తుని హృదయం పరమానందభరితం కావాలని స్వామివారిని కోరుకుంటూ...

ఎల్.వి. సుబ్రహ్మణ్యం, I.A.S.,
కార్యనిర్వహణాధికారి, తితిదే

## ముందుమాట

భారతీయసంస్కృతికి తరతరాల వారసత్వ సంపదకు ఆధారభూతమైనది ఆలయం. మన భరతఖండములో విరాజిల్లుతున్న ప్రధాన ఆలయాలలో ఆర్ష సంస్కృతి సాంప్రదాయ పరిరక్షణకు హేతుభూతమైనది శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యాలయం. ఈ ఆలయం వేదపురాణ ఇతిహాస చరిత్ర కావ్య స్తోత్ర బద్ధమై అలరారుతూ చరిత్రకందని కాలంనుంచి అనేక సాంప్రదాయాలతో అనేక ఉపచారాలతో వైఖానసాగమ శాస్త్రబద్ధములైన పూజావిధానములతో అలరారుచున్నది.

వేంకటాద్రి సమస్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।

వేంకటేశసమోదేవో నభూతో న భవిష్యతి ॥

అన్న పురాణ వచనానుసారం ఈ క్షేత్రముతో సమానమైన క్షేత్రం లేదనీ ఈ దైవంతో సమానమైన దైవం లే దనీ తెలుస్తుంది.

స్వామివారిఆలయంలో అనేకములైన ఉత్సవములు, పూజలు అత్యంత వైభవంగా దినదిన ప్రవర్ధమానంగా ఆచరింపబడుతూ ఉన్నాయి. వాటిని ప్రత్యక్షంగా చూడలేని భక్తులకు, ఆస్తికులకు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్ ద్వారా కొన్నింటిని ప్రత్యక్షప్రసారం చేస్తూ, కొన్నింటిని అలిపిరివద్దగల నమూనా ఆలయంలో చిత్రీకరించి ప్రసారం చేస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని, చైతన్యాన్ని కలుగచేస్తూ ఉన్నదనుట నిత్యసత్యము.

**గోవిందం-పరమానందం** అనే ఈ చిన్న పుస్తకంలో శ్రీవారి నిత్యసేవలను చదివి తిరుమలలో ఉన్నట్లు భావించి అమితమైన ఆధ్యాత్మిక చైతన్యముతో శ్రీనివాసుని కృపాదృష్టిని పొందగలందులకుగాను పురాణోక్తంగా షోడశోపచారపూజావిధానాన్ని సుప్రభాతంతో, అష్టోత్తర శతనామావళితో, కథాసంగ్రహముతో, గోవిందనామావళితో పొందుపరచడం జరిగింది.

భక్తులు తమ ఇంటివద్దనే శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవములను ఈ ఛానల్ ద్వారా తిలకిస్తూ వ్రతకల్పంతో పునీతులై, స్వామివారి అనుగ్రహాన్ని పొంది జన్మధన్యతను పొందగలరని ఆశిస్తూంది శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్.

## ఇందులో ......


1) శ్రీవారి నిత్యసేవలు

2) శ్రీనివాస స్తుతి

3) శ్రీవేంకటేశ్వర పూజాకల్పం

4) శ్రీవేంకటేశ్వర అష్టోత్తరశతనామావళి:

5) క్షమాప్రార్థన

6) కథాసంగ్రహం

7) గోవిందనామావళి

8) శ్రీ వేంకటేశ వజ్రకవచ స్తోత్రం

9) శ్రీ వేంకటేశ కరావలంబ స్తోత్రం


- - -

# శ్రీవారి నిత్యసేవలు....

సకలలోక సార్వభౌముడైన శ్రీనివాసస్వామికి నిత్య సేవలూ, మరెన్నో ఉత్సవాలూ తరతరాలుగా, నిర్విఘ్నంగా సాగుతు న్నాయి. ఏనాడు ప్రారంభమైనాయో కానీ, ఈ సేవలవైభవం, నానాటికీ ద్విగుణీకృతమైన వైభవంతో పరిఢవిల్లుతున్నాయి. ఆనందనిలయునికి అనంతకీర్తిని, శ్రీవారి భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యస్ఫూర్తినీ కల్గిస్తున్నాయి. తరాలు మారినా, తరగని భక్తి శ్రద్ధలతో, భక్తకోటిని తరింపజేస్తున్నాయి.

సుప్రభాతగానాన్ని ఆలకించి, నవనీతహారతిని అందు కొని, విశ్వరూప దర్శనాన్ని ప్రసాదించే స్వామివారు, అనేక నిత్య సేవలను అందుకొంటూ, రాత్రి ఏకాంతసేవలో హాయిగా ముత్యాలహారతితో విశ్రమిస్తారు.

ఇలాగే ప్రతిరోజూ సుప్రభాత నవనీతహారతి నుండి రాత్రి ఏకాంతసేవ సమయంలో ముత్యాలహారతివరకూ జరిగే, శ్రీవారి నిత్యసేవావైభవాన్ని సామాన్యభక్తులకు అందజేయాలన్న సంకల్పమే ఈ **"గోవిందం - పరమానందం"** !

## సుప్రభాత సేవ

**కౌసల్యా సుప్రజా రామ ! పూర్వాసంధ్యా ప్రవర్తతే ।**
**ఉత్తిష్ఠ నరశార్దూల ! కర్తవ్యం దైవ మాహ్నికమ్ ॥**

తరతరాలుగా, హైందవ జాతిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేస్తున్న మహత్తర శ్రీవేంకటేశ్వరస్తవం ఈ సుప్రభాతం. 29 శ్లోకాలున్న సుప్రభాతాన్ని, 11శ్లోకాలున్న స్తోత్రాన్ని, 16శ్లోకాలున్న ప్రపత్తిని, 14శ్లోకాలున్న మంగళాశాసనాన్ని, 15వ శతాబ్దంలో మనవాళ మహాముని శిష్యులైన ప్రతివాద భయంకర అణ్ణన్ స్వామి రచించారు. వీరి అసలుపేరు హస్తిగిరినాథన్. ఈ దివ్యగానాన్ని ఎక్కడ విన్నా, మనస్సు తిరుమల క్షేత్రాన్ని చేరుకొంటుంది. అలౌకికానందంతో, శ్రీవారి సామీప్య, సాన్నిధ్యాన్ని అనుభవిస్తుంది. అంతటి మహత్తు కల్గిన ఈ సుప్రభాత గీతాన్ని, తిరుమలలో సుప్రభాత సేవ జరిగే విధానాన్ని గురించి తెల్సుకుందాం.

ప్రతిరోజూ బ్రాహ్మీముహూర్తాన (తెల్లవారుఝాము 2.30-3.00 గం॥ల మధ్య) తిరుమల ఆలయంలో శ్రీవారికి సుప్రభాత సేవ జరుగుతుంది. ఆ సమయంలో సన్నిధిగొల్ల స్నానాదికాలు పూర్తిచేసుకుని, తిరునామం ధరించి, దివిటీ పట్టుకొని, తిరుమల ఉత్తర మాడవీథిలోని అర్చకుల ఇంటికి వెళతాడు. శ్రీవారి కైంకర్యపరులైన వైఖానస అర్చకులు అప్పటికే స్నానసంధ్యావందనాది అనుష్ఠానాలను పూర్తిచేసుకుని సిద్ధంగా వుంటారు.

సన్నిధిగొల్ల వారికి నమస్కరించి, వారిని శ్రీవారి ఆలయానికి ఆహ్వానిస్తాడు. వారు శ్రీవారి బంగారువాకిలిని తెరిచే పరికరమైన కుంచెకోల అనే కొడవలి వంటి ఇనుపకొక్కీని భుజంపై పెట్టుకుని, తాళంచెవులను తీసుకుని శ్రీవారిని స్మరిస్తూ సన్నిధిగొల్లను అనుసరిస్తారు.

ఇలా అర్చకస్వాములు మహాద్వారం వద్దకు చేరగానే నగారామండపంలో పెద్ద పలకగంట(నౌబత్ఖానా)ను హెచ్చరికగా మ్రోగిస్తారు. ఆ ఘంటానాదంతో మహాద్వారం తెరువబడుతుంది. సన్నిధిగొల్లను అనుసరిస్తున్న అర్చకులు ప్రధాన ద్వార దేవతలకు మంత్రపూర్వక ప్రణామాలర్పిస్తూ ఆలయప్రవేశం చేస్తారు. వారివద్ద వున్న కుంచెకోలను, తాళంచెవులను, ధ్వజస్తంభం వద్ద వున్న క్షేత్రపాలకశిలకు భక్తితో తాకించి, నమస్కరించి, ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వెండివాకిలిని దాటి, బంగారువాకిలిముందు మౌనంగా స్వామివారిని ధ్యానంచేస్తూంటారు.

వారిని అక్కడ వదిలి, సన్నిధిగొల్ల మరల శ్రీవారి సన్నిధివీథిలోని బేడి ఆంజనేయస్వామిగుడివద్ద వున్న శ్రీమాన్ పెద్దజియ్యంగార్ మఠానికి వస్తాడు. అప్పటికే సిద్ధంగా వున్న జియ్యంగారినీ, లేదా వారి పరిచారకుడైన ఏకాంగినీ ఆహ్వానించి ఆలయానికి వెంటబెట్టుకుని వస్తాడు. ఆ సమయానికి ఆలయ అధికారి పేష్కారు, శ్రీవారి సుప్రభాతాన్ని పఠించే వేదపండితులు, బంగారు వాకిళ్ల ముందు నిలిచివుంటారు. అలాగే తాళ్లపాక అన్నమయ్య వంశీయులొకరు తంబుర చేత ధరించి, మేలుకొలుపు సంకీర్తన పాడటానికి సిద్ధంగా వుంటారు. ఇంతలో సుప్రభాతసేవకు నిర్ణీతరుసుమును చెల్లించినభక్తులు బంగారువాకిలి ముందుకు అనుమతిస్తారు.

అర్చకులు, జియ్యంగార్, ఆలయ అధికారులు, వేదపండితులు, తాళ్లపాకవారు, సన్నిధిగొల్ల, సుప్రభాతసేవా భక్తులు వీళ్లందరిసమక్షంలో అర్చకులు తమదగ్గర వున్న కుంచెకోలతో బంగారువాకిలికి గల చిన్న రంధ్రం ద్వారా లోపల వేసివున్న గడియను తీస్తారు. తర్వాత గడియకు వేయబడిన తాళాన్ని అర్చకులు తమవద్ద వున్న తాళాలతో తీస్తారు. అటు తర్వాత, సన్నిధిగొల్ల పేష్కారు దగ్గర గల సీలువేసిన చిన్నసంచిలో వున్న తాళంచెవులతో, సీలువేయబడివున్న మూడు పెద్దతాళాలను అందరికీ చూపించి తీస్తాడు.

బంగారువాకిలి తెరుచుకుని సన్నిధిగొల్ల దివిటీతో ముందుగా లోనికి ప్రవేశిస్తాడు. మరుక్షణం శ్రీవారి అర్చకులు మధురస్వరంతో **"కౌసల్యా సుప్రజా రామా"**....అంటూ సుప్రభాతాన్ని ఆలపిస్తూ బంగారువాకిలిలోకి ప్రవేశిస్తారు. ఏకాంగి, మహంతుమఠం వారు దెచ్చిన పాలు, చక్కెర, వెన్న, తాంబూలం గల పళ్లెరాన్ని అందుకుని లోనికి వెళతారు. బంగారు వాకిళ్లు దగ్గరకు మూయబడతాయి.

బంగారువాకిలి ముందు వున్న వేదపండితులు, అర్చకులు ప్రారంభించిన సుప్రభాతగీతాన్ని అందుకుని శ్రుతిశుభగంగా ఆలపిస్తారు. స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం పూర్తయిన వెంటనే, అన్నమయ్య వంశీయులు బంగారువాకిలి ముందు నిలబడి, అన్నమయ్య రచించిన ఒక మేలుకొలుపు కీర్తనను భూపాలరాగంలో గానంచేస్తారు.

సుప్రభాతంలో శ్రుతికలిపి, అన్నమయ్య మేలుకొలుపు పాటను ఆలకిస్తూ,

భక్తిప్రపత్తులతో మైమరిచి వున్న భక్తులు బంగారు వాకిళ్లను ఎపుడు తెరుస్తారో ? శ్రీవారి దివ్యమంగళ మూర్తిని ఎపుడు దర్శిస్తామో ? అని ఒళ్లంతా కళ్లు చేసుకుని వేచివుంటారు.

బంగారువాకిలిని దగ్గరగా మూసిన సన్నిధిగొల్ల వద్ద నున్న దివిటీ వెలుగులో, అర్చకులు రాములవారిమేడకు వేసివున్న తలుపు తాళాలను తీసి, శయనమండపంలో పానుపుపై వున్న భోగశ్రీనివాసమూర్తికి ప్రదక్షిణంగా సన్నిధికి చేరుకుంటారు. దివిటీతో ముందుగా లోపలికి వెళ్లిన సన్నిధిగొల్ల, కులశేఖరపడి వద్ద నిలచి,ఆ వెలుగులో శ్రీవారి దివ్యమంగళమూర్తిని తొలిదర్శనం చేసుకుంటాడు. అనంతరం శ్రీవారి అర్చకస్వాములు, ఏకాంగి, కులశేఖరపడి దాటి లోపలకు ప్రవేశిస్తారు.

గొల్ల చేతిలో వున్న దివిటీని అందుకొని ఏకాంగి సన్నిధి లోని దీపాలను వెలిగించగా, సన్నిధిగొల్ల రాములవారి మేడలోని దీపాలను వెలిగిస్తాడు. అనంతరం అర్చకులు శ్రీవారికి పాదనమ స్కారం చేసి, శయనమండపంలో బంగారు పట్టుపరుపుపై పవ ళించి వున్న భోగశ్రీనివాసమూర్తిని సమీపించి, నమస్కరించి, చప్పట్లు చరిచి, మేల్కొనవలసిందిగా ప్రార్థిస్తారు. అంతట భోగశ్రీని వాసమూర్తి విగ్రహాన్ని మూలమూర్తి సన్నిధిలో (జీవస్థానంలో) వేంచేపు చేస్తారు.

ఆనందనిలయంలో కులశేఖరపడివద్ద తెరవేసి, అర్చ కులు, శ్రీవారికి దంతధావన, ఆచమనాది అనుష్ఠాన క్రియలను సమర్పించి, మహంతుమఠంవారు తెచ్చిన నవనీతాన్ని,పాలు, చక్కెరను నివేదనచేసి, సుగంధ తాంబూలాన్ని సమర్పిస్తారు.

బంగారువాకిలి ముంగిట్లో వేదపండితులు సుప్రభాతం, మంగళాశాసనాన్ని ముగిస్తూ వుండగా, లోపల అర్చకులు శ్రీవారికి నవనీతహారతి యిస్తూ వుండగా, బంగారువాకిళ్లు తెరువబడతాయి. అక్కడే వేచివున్న భక్తులు, భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుంటారు. నవనీతహారతి వెలుగుల్లో శతకోటి మన్మథాకారుడైన శ్రీస్వామి, అనంతకోటి దివ్యకాంతులతో దర్శనమిస్తాడు. శ్రీవారి బంగారుపాదాలపై తులసి, పుష్పములు వంటివి లేకుండా ఆపాదమస్తకం దర్శించే ఈ దర్శనాన్ని **'విశ్వరూప సందర్శనం'** అంటారు.

నివేదనానంతరం యిచ్చే కర్పూరహారతిని **'నవనీత హారతి'** అంటారు. హారతి తర్వాత అర్చకులు, గతరాత్రి బ్రహ్మాదిదేవతలు శ్రీవారిని అర్చించడంకోసం మూలసన్నిధిలో వుంచిన బ్రహ్మతీర్థాన్ని, చందనాన్ని, శఠారిని ముందుగా స్వీకరించి, ఆ తర్వాత, జియ్యంగారికి, ఏకాంగికి ఇస్తారు. సన్నిధిగొల్లకు కూడా తీర్థం, శఠారితో బాటు, నివేదనపళ్లెంలోని తాంబూలాన్ని అర్చకులు అందజేస్తారు.

అనంతరం జియ్యంగార్, ఏకాంగి, సన్నిధిగొల్ల బంగారు వాకిలి వెలుపలికి వస్తారు. దేవస్థానం పరిచారకులు లోనికి వెళ్లి శ్రీవారిపాన్పును, మంచాన్ని తీసి బయటగల సబేరాగదిలో వుంచు తారు. సుప్రభాతాన్ని పఠించిన వేదపండితులు, అన్నమయ్య వంశీయులు, మహంతు, మైసూరు సంస్థానం తరఫువారు, ఇంకా స్వామివారి కైంకర్యంలో పాల్గొన్న స్థానీయులు స్వామివారి సన్నిధికి వెళ్లి హారతి, తీర్థం, చందనం, శఠారి మర్యాదలు పొందుతారు. వీరికి శ్రీవారికి నివేదించిన చందనం, వెన్న ప్రసాదంగా ఇవ్వబడు తుంది. ఆ తర్వాత ఆలయాధికారులు, సర్కారు (దేవస్థానం) వారి హారతి జరిపి, తీర్థ చందన నవనీత ప్రసాదాలను స్వీకరిస్తారు. స్వామివారి సుప్రభాత సేవకు వచ్చియున్న భక్తులు, వరుసగా స్వామివారి సన్నిధికి వెళ్లి ఆ దివ్యమంగళమూర్తిని దర్శించి తీర్థం శఠారులను స్వీకరించి ధన్యులౌతారు.

**శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రసారమవుతున్న శ్రీవారి సుప్రభాత సేవను మీ గృహంలోనే వీక్షించండి, తిరుమలలో ఉండి, శ్రీవారిని సేవించిన అనుభూతిని పొందండి.**

## తోమాలసేవ (భోగశ్రీనివాసమూర్తికి అభిషేకం)

పుష్పాలంకారప్రియుడైన శ్రీనివాసుని దివ్యమంగళ మూర్తికి అనేక పుష్పమాలికలతో, తులసి మాలలతో చేసే అలం కారమే తోమాలసేవ! ముందురోజు రాత్రే, ఆయా కాలాల్లో లభించే అనేకరకాల పరిమళపుష్పాలతో తయారుచేయబడిన మాలికలు, యోగ నృసింహస్వామి ఆలయం ప్రక్కన గల పుష్పఅరలో సిద్ధం చేస్తారు. సుప్రభాతం తరువాత స్వామికి జరిగే ఈ సేవ ఉ।। 3-00లకు ప్రారంభమవుతుంది.

సేవాసమయానికి ఈ మాలలు వున్న వెదురుగంపను జియ్యంగారు తలపై పెట్టుకుని, ఛత్రచామర సమేతంగా పలక గంట, సన్నడోలు మ్రోగుతుండగా, సన్నిధిగొల్ల దివిటీతో దారి చూపుతుండగా, పుష్పఅర నుండి బయలుదేరి ధ్వజస్తంభానికి ప్రదక్షిణం చేసి, వెండివాకిలి ద్వారా లోనికి వచ్చి, విమాన ప్రదక్షి ణం చేసి బంగారు వాకిలి ద్వారా, శ్రీవారిసన్నిధిలో సమర్పిస్తారు.

అర్చకస్వామి ఈ మాలలను స్వీకరించి, నీళ్లుచల్లి శుద్ధి పరుస్తారు. తోమాలసేవ చేయడానికి ముందుగా భోగశ్రీని వాసమూర్తికి అభిషేకం ప్రారంభమౌతుంది. అభిషేకానికి ఆకాశ గంగ తీర్థాన్ని వినియోగిస్తారు. పూర్వం శ్రీవారి నిత్యాభిషేక కైంక ర్యంలో తరించినమహాభక్తుడు తిరుమలనంబి వంశీయులు ఈ ఆకాశగంగాతీర్థాన్ని వెండిబిందెలతో, ఛత్రచామర, మంగళవాద్య మర్యాదలతో తీసుకొనివస్తారు. వారు బిందెలతో ఆలయానికి ప్రదక్షిణం చేసి, శ్రీవారి సన్నిధిలో వుంచుతారు.

అనంతరం అర్చకస్వామి శ్రీవారికి నమస్కరించి, భోగ శ్రీనివాసమూర్తిని వెండిస్నానపీఠంపై వేంచేపు చేయిస్తారు. అర్ఘ్య పాద్య ఆచమన అనుష్ఠాన ఉపచారాలు చేసిన తర్వాత, ఆకాశగంగతీర్థంనుండి తీసుకొని వచ్చిన పవిత్రజలంతో భోగ శ్రీనివాసమూర్తికి అభిషేకం చేస్తారు.

పిదప, శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిజపాదాలపై వున్న బంగారు తొడుగులకుకూడా అభిషేకం చేస్తారు. పిదప వేదపండి తులు పురుషసూక్తం పఠిస్తూండగా, అర్చకులు శ్రీవారి సన్నిధిలోని, నృసింహ, శ్రీరామ, మొదలగు సాలగ్రామాలకు అభిషేకం చేస్తారు. అనంతరం, మూలమూర్తికి, వక్షఃస్థల లక్ష్మికి, శ్రీదేవీ, భూదేవీ సమేత

మలయప్పస్వామికి, ఉగ్ర శ్రీనివాసమూర్తికి, ఇలా సన్నిధిలో ఉన్న పంచబేరాలకు అభిషేకం చేయించినట్లుగా ఆకాశగంగా తీర్థాన్ని సంప్రోక్షిస్తారు.

ఈ అభిషేకం జరిగే రోజున రోహిణీనక్షత్రం ఉన్నట్లైతే, భోగశ్రీనివాసమూర్తితో పాటు, సన్నిధిలోనే వున్న రుక్మిణీ శ్రీకృష్ణు లకు, తిరుమంజనం (అభిషేకం) నిర్వహిస్తారు. అలాగే పునర్వసు నక్షత్రం ఉన్నట్లైతే శ్రీసీతారామ లక్ష్మణులకు, శ్రవణ నక్షత్రం రోజైతే, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి అభిషేకం జరుగుతుంది.

అభిషేకం తరువాత, భోగశ్రీనివాసమూర్తికి వస్త్రాలం కరణ, తిలకధారణ చేసి, మిగిలిన ఉత్సవమూర్తులకు షోడశోప చారాలు సమర్పిస్తూండగా, జీయర్లు, వైష్ణవస్వాములు, దివ్య ప్రబంధంలోని తొండరడిప్పొడి ఆళ్వార్లు గానం చేసిన 'తిరుప్పళ్ళి ఎళుచ్చి' అనే అరువది పాశురాలను పారాయణం చేస్తారు.

## తోమాలసేవ (శ్రీవారికి పుష్పాలంకరణం)

**క్షణమాత్రం దర్శనంతో అలౌకికమైన ఆనందాన్ని ప్రసాదించే దివ్యమంగళస్వరూపుడు శ్రీ వేంకటేశ్వర స్వామి. వారికి జరిగే పుష్పాలంకరణం అనే ఈ తోమాలసేవను సామాన్య భక్తులందరూ కన్నుల పండువుగా వీక్షించి తరించాలన్న ఉద్దేశంతో, అలిపిరి నమూనా ఆలయంలో శ్రీవారి అర్చకులతో తోమాలసేవను నిర్వహించి, శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్ చిత్రీకరించి భక్తకోటికి సమర్పిస్తూంది.**

జియ్యంగార్లు శ్రద్ధాభక్తులతో అందిస్తున్న పూలమాలలను అర్చకస్వాములు స్వీకరించి, ముందుగా భోగశ్రీనివాసమూర్తిని అలంకరిస్తారు. ఆ తర్వాత శ్రీవారి మూలమూర్తికి కంఠంలోనూ, హృదయంపైన, పుష్పమాలలు వేసి, శంఖుచక్రాలను, కిరీటాన్ని, నందకఖడ్గాన్ని అలంకరిస్తారు.

ఆ తర్వాత భుజాలమీదుగా నాభివరకు, నడుము వరకు, ఊరువుల వరకు, మోకాళ్ల వరకు, పాదాల వరకు వ్రేలాడునట్లుగా పొడవైన పూలదండలను అలంకరిస్తారు. ఈ పుష్పాలంకరణం శ్రీవారిపాదాలతో ప్రారంభమౌతుంది. ఆపాదమస్తకం అలంకరించే ఈ పుష్పమాలలకు కొన్ని స్థిరమైన పేర్లు కలిగివుండటం ఒక విశేషం !

శ్రీవారి పాదాలపై అలంకరించే ఒక్కొక్క మూరగల రెండు పుష్పమాలలను **తిరువడి దండలు** అంటారు. శ్రీవారి కిరీటం మీదుగా రెండు భుజాలవరకు అలంకరించబడే 8 మూరల పుష్పమాలను **శిఖామణి** అని, శ్రీవారి భుజాలనుండి ఇరువైపులా పాదాలవరకు వ్రేలాడుతున్నట్లు అలంకరించే పొడవాటి మాలలను **సాలగ్రామమాల** అని, శ్రీవారి మెడలో రెండు పొరలుగా భుజాలమీదకి అలంకరించబడే మూడున్నర మూరల పుష్పహారాన్ని **కంఠసరి** అని అంటారు.

శ్రీవారివక్షఃస్థలంలో వున్న శ్రీదేవి, భూదేవులకు ఒకటిన్నర మూరల పుష్పమాలికలను అలంకరిస్తారు.ఒక్కొక్కటి ఒక్కొక్క మూర వున్న రెండుదండలను శంఖచక్రాలకు అలంకరిస్తారు. శ్రీవారి నందకఖడ్గానికి, అలంకరించే రెండు మూరల పుష్పమాలికను **కఠారిసరం** అంటారు. రెండు మోచేతుల క్రిందనుండి పాదాల వరకు హారాలుగా వ్రేలాడదీసే 3 పుష్పమాలలను **తావళములు** అంటారు.

ఇలా ఒక్కొక్క మాల సమర్పిస్తూండగా, క్రొంగొత్త వెలుగు లతో దర్శనమిస్తున్న కల్యాణచక్రవర్తిని కన్నులారా వీక్షిస్తూన్న భక్తులు అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతుంటారు.

శ్రీవైష్ణవస్వాములు, గోదాదేవి కీర్తించిన తిరుప్పావైలోని పాశురాలను శ్రావ్యంగా గానం చేస్తూండగా, అర్చకస్వాములు శ్రీదేవీ భూదేవీ సమేతుడైన మలయప్పస్వామికి, ఉగ్ర శ్రీనివాస మూర్తికి, కొలువు శ్రీనివాసమూర్తికి, శ్రీసీతాలక్ష్మణ సహితుడైన కోదండరామస్వామికి, రుక్మిణీసమేతుడైన శ్రీకృష్ణస్వామికి, చక్రత్తా ళ్వార్‌కు, సన్నిధిలోని సాలగ్రామాలకు పుష్పమాలలు అలం కరిస్తారు.

పుష్పమాలాలంకరణం పూర్తి అయిన తరువాత వేదపండి తులు మంత్రపుష్పాన్ని సమర్పిస్తారు. ఆ తర్వాత ధూప, దీప, నక్షత్రహారతులు ఇస్తారు. చివరిగా శ్రీస్వామివారికి కర్పూరహారతి ఘనంగా జరుగుతుంది. సుమారు అరగంటపైగా, శ్రీనివాసుని దివ్యమంగళమూర్తిని దర్శించుకున్న భక్తులు ఆనంద పరవశులై, శ్రీస్వామివారి సన్నిధికి వచ్చి వరుసగా దర్శించుకుంటారు. అర్చక స్వాముల ఆశీస్సులతో కూడిన శఠారిని అందుకుని ఆనందనిలయ విమాన ప్రదక్షిణం చేస్తూ వెలుపలికి వస్తారు.

## కొలువు (దర్బార్)

బంగారు వాకిలికి ఆనుకుని లోపల వున్న గదిని **'స్నపన మండపం'** అంటారు. ఇక్కడే శ్రీవారికి ప్రతిరోజూ ఆస్థానం జరుగుతుంది. సన్నిధిలో వున్న కొలువు శ్రీనివాసమూర్తిని ఛత్రచామరాది మర్యాదలతో, మంగళవాద్య పురస్సరంగా స్నపనమండపంలో ఉంచిన బంగారు సింహాసనంపై వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామికి కొలువు నిర్వహించబడుతుంది. ఈ సేవ పూర్తిగా ఏకాంతం. ఆలయ అధికారులు, అర్చకులచే నిర్వహించబడుతుంది. ఉ॥ 4-30లకు ప్రారంభమవుతుంది.

ఈ మూర్తికి షోడశోపచారాలు నిర్వహించి, ధూపదీప హారతులు సమర్పిస్తారు. అనంతరం అర్చకులు శ్రీవారి చేత తాంబూలం, దక్షిణతో కూడిన బియ్యాన్ని దానంగా స్వీకరించి, **'నిత్యైశ్వర్యోభవ'** అని శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని భక్తిపూర్వకంగా ప్రార్థిస్తారు. ఆస్థానసిద్ధాంతి శ్రీనివాసప్రభువునకు పంచాంగ శ్రవణం చేస్తూ, ఆనాటి, తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలను వినిపిస్తూ, నాటి ఉత్సవవిశేషాలను శ్రీవారికి తెలుపుతారు. అదేవిధంగా మరునాటి తిథి, వార, నక్షత్రాదులను కూడా విని పిస్తారు. నిత్యాన్న ప్రసాద పథకంలో విశేషమైన విరాళాలు ఇచ్చిన దాతల పేర్లను శ్రీవారికి వినిపిస్తారు. బొక్కసం (లెక్కల) గుమాస్తా, శ్రీవారికి సమర్పింపబడిన ముందునాటి ఆదాయ వివరాలను, ఆర్జితసేవలవల్ల, ప్రసాదాల విక్రయం వల్ల, హుండీద్వారా, కాను కలుగా వచ్చిన బంగారు, వెండి, రాగి, ఇతర లోహపాత్రలు, నగలు, వగైరాల ద్వారా వచ్చిన నికర ఆదాయాన్ని

పైసలతో సహా లెక్కగట్టి శ్రీనివాససార్వభౌమునికి వివరంగా వినిపించి, భక్తి ప్రపత్తులతో సాష్టాంగనమస్కారం చేసి సెలవు తీసుకుంటాడు.

**ప్రతినిత్యం కొలువు శ్రీనివాసమూర్తికి ఏకాంతంగా జరిగే ఈ కొలువుసేవను నమూనాఆలయంలో చిత్రీకరించి సామాన్య భక్తులందరికీ శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ సమర్పిస్తోంది. సకల లోక సార్వభౌముని కొలువును కన్నులారా వీక్షించి ఆనందించండి!**

## సహస్రనామార్చన

తిరుమలక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతి రోజూ మూడుపూటలా ఈ అర్చనసేవ జరుగుతుంది. ఉదయా త్పూర్వం జరిగే మొదటిఅర్చనలో శ్రీవారు సహస్రనామావళితోను, మధ్యాహ్నం, సాయంత్రం జరిగే అర్చనలలో, అష్టోత్తరశత నామాల తోను అర్చింపబడతారు. ఆనందనిలయంలో, ఉదయం 4 నుండి 5 గం॥ల మధ్య జరిగే సహస్రనామార్చనకు నిర్ణీతరుసుము చెల్లించిన భక్తులు, వైకుంఠం క్యూ ద్వారా శ్రీవారిఆలయంలోకి ప్రవేశిస్తారు. ఈ భక్తులు కులశేఖరపడి నుండి గరుడాళ్వార్ సన్నిధి వరకు బారులుతీరి కూర్చొని, సహస్రనామార్చనలో పాల్గొంటారు. శ్రీవారిపాద పద్మాలవద్ద వైఖానసార్చకస్వాములు ఒక మేడికర్రతో చేయబడిన కూర్మాసనంమీద కూర్చొని, లోకకల్యాణార్థం శ్రీవారి సహస్రనామార్చనను ప్రారంభిస్తారు.

పవిత్రమైన బ్రాహ్మీముహూర్తంలో శ్రీవారి సహస్రనామా వళి, ఆలయంలోనే గాక, తిరుమల పుణ్యక్షేత్ర మంతటా వినిపిస్తూ, భక్తులహృదయాలలో దివ్య ప్రశాంతిని ప్రసాదిస్తుంది. ఆ తరువాత అర్చకులు శ్రీవారి పాదాలను అర్చించిన తులసీదళాలతో, శ్రీస్వామి వారి వక్షఃస్థలంలో వెలసియున్న మహాలక్ష్మీఅమ్మవారిని అర్చిస్తారు. అనంతరం శ్రీవారికి నక్షత్రహారతిని ఇస్తారు. నారికేళం, అరటి పండ్లను నివేదించి కర్పూరహారతిని సమర్పిస్తారు. దీనితో సహస్ర నామార్చన పూర్తవుతుంది.

శ్రీవారిఎదురుగా కూర్చుని శ్రీవేంకటేశ్వరుని దివ్య మంగళ విగ్రహాన్ని కరువుదీరా దర్శిస్తూ, ఆనంద డోలికల్లో తేలు తున్న భక్తులు దివ్యానుభూతితో స్వామివారిసమీపానికి వరుసగా వెళ్లి కర్పూర హారతి వెలుగుల్లో శ్రీస్వామిని దర్శించి, మైమరచి మరలలేక, మరల, మరల స్వామివారిని తిరిగి తిరిగి చూస్తూ పరమానందభరితులౌతారు.

ఆ తర్వాత స్వామివారికి చక్కెర పొంగలి, పులిహోర, పొంగలి, మున్నగు అన్నప్రసాదాలతోను, లడ్లు, వడలు వంటి పిండివంటలతో నిండిన గంగాళాలను స్వామివారి ముందు వుంచి నివేదన జరుపుతారు. అంతకుముందుగానే, ఒక పరిచారకుడు శ్రీవారి వంటశాల నుండి ప్రసాదాలను ఛత్రచామర మంగళవాద్య పురస్సరంగా వరాహస్వామి ఆలయానికి బయల్దేరతాడు. తిరుమల క్షేత్ర సంప్రదాయంప్రకారం శ్రీవరాహస్వామివారికి తొలి నివేదన జరుగుతుంది. అక్కడ నివేదన జరిగిన తర్వాత, ఇక్కడ ఆనందనిలయంలో శ్రీవారికి నైవేద్య సమర్పణ జరుగుతుంది. అనంతరం అర్చకులు సుగంధద్రవ్య పూరితమైన తాంబూలాన్ని భక్తిగా శ్రీవారికి సమర్పిస్తారు.

తిరుమలక్షేత్రంలో ఎంతో ప్రాచీనతను, ఔన్నత్యాన్ని సంతరించుకున్న ఈ సహస్రనామార్చన నేటికీ భక్తలోకంలో విశేషమైన ప్రాముఖ్యాన్ని పొందింది. ఈ అర్చన చేసినా, చూచినా, విన్నా, పాపవిముక్తులౌతారని, సర్వదోషాలు హరిస్తాయని ఈ నామావళి మాహాత్మ్యాన్ని నారదమహర్షి కీర్తించాడు. **అంతటి మహత్తరమైన ఈ అర్చనసేవను సామాన్యభక్తులందరూ వీక్షించా లనే ఉద్దేశంతో, శ్రీవారిఅర్చకులతో నమూనా ఆలయంలో నిర్వ హించి, ప్రసారం చేస్తున్నది శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్. వీక్షించి, తరించండి.**

## నిత్యకల్యాణోత్సవం

శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీమలయప్పస్వామికి ప్రతినిత్యం కల్యాణోత్సవం జరుగుతుంది. రెండవ అర్చన, గంట, నివేదన పూర్తయిన తర్వాత శ్రీవారిఉత్సవమూర్తులు సకల రాజ మర్యాదలతో తిరుచ్చిని అధిరోహించి, ఆనందనిలయం నుండి సంపంగి ప్రదక్షిణలో గల కల్యాణమండపానికి తరలివస్తారు. 15వ శతాబ్దంలో తాళ్లపాక వంశస్థులచే ఈ కల్యాణోత్సవం ఆరంభించ బడినట్లు శాసనాలవల్ల తెలుస్తూంది. తాళ్లపాక వంశస్థులే నేటికీ కన్యాదాతలుగా వ్యవహరించటం గమనార్హం. సర్వజనులు క్షేమ స్థైర్య ధైర్యాదులతో ఉండాలనీ స్త్రీలు ఈ జన్మలోనూ రాబోవు జన్మలోను సువాసినులుగా ఉండాలనే మహాసంకల్పంతో ఏడు కొండలరాయనికి కళ్యాణోత్సవం చేయటం పరిపాటి. ఈ నిత్య కల్యాణం వల్లనే **శ్రీవారికి కల్యాణచక్రవర్తి** అని, తిరుమల క్షేత్రం నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్నదని ప్రశస్తి ఏర్ప డింది. **ప్రతిరోజూ మధ్యాహ్నం 12గం॥ల నుండి 1గం॥ వరకు నిర్వహించే ఈ నిత్యకల్యాణోత్సవాన్ని శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రతిరోజూ ప్రత్యక్షప్రసారం చేస్తోంది. కోట్లాది భక్తులు వీక్షించి తరిస్తున్నారు.**

## డోలోత్సవం

శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీమలయప్పస్వామి కల్యాణోత్సవ అనంతరం, గృహస్థుల ప్రార్థనలపై అద్దాల మహల్‌కు వేంచేస్తారు. ఈ మండపం మధ్యలో ఉన్న డోల (ఉయ్యాల)లో స్వామివారికి ఉభయదేవేరుల సమేతంగా డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మండపంలో బిగించివున్న అద్దాలలో అన్నివైపులా స్వామి కనిపిస్తూ భక్తులకు దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తూ, తనసర్వవ్యాపకత్వాన్ని తెలియజేస్తున్నాడు. అనంతరం కర్పూర నీరాజనం, ప్రసాదవితరణ జరుగుతుంది. **ప్రతిరోజు మధ్యాహ్నం 1-2గం॥ల మధ్య జరిగే ఈ డోలోత్సవాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. వీక్షించండి.**

## ఆర్జిత బ్రహ్మోత్సవం

ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామికి సంక్షిప్తంగా వాహనసేవలను నిర్వహించడం ఆర్జిత బ్రహ్మోత్స వంగా పిలువబడుతూంది. నిర్ణీతరుసుము చెల్లించిన భక్తుల సమక్షంలో, మలయప్పస్వామివారిని వరుసగా శేష, గరుడ, హనుమంత, వాహనాలపై వేంచేపు చేయించి, కర్పూర నీరాజనాన్ని సమర్పిస్తారు.

**ప్రతిరోజు మధ్యాహ్నం 2-3గం॥ల మధ్య వైభవోత్సవ మండపంలో జరిగే, ఈ ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించి తరించండి.**

## **ఆర్జిత వసంతోత్సవం**

ఆర్జిత వసంతోత్సవానికి నిర్ణీతరుసుమును చెల్లించిన భక్తుల సమక్షంలో వసంతోత్సవం జరుగుతుంది. పాలు, పెరుగు, చందనం, పసుపు మున్నగు అభిషేక ద్రవ్యాలతో కన్నులపండువగా జరిగే ఈ **వసంతోత్సవం వైభవోత్సవ మండపంలో సాయంకాలం 3-4గం॥ల మధ్యలో నిర్వహించబడుతుంది. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తూ భక్తులను తరింపజేస్తున్నది.**

## **సహస్రదీపాలంకరణ సేవ**

ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామివారు, సర్వాలంకార భూషితులై వైభవోత్సవ మండపం నుండి కొలువు మండపానికి విచ్చేస్తారు. అప్పటికే దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న సహస్రదీపాలమధ్య ఉన్న ఊయలలో స్వామివారు ఉభయ దేవేరుల సమేతంగా ఆసీనులై, భక్తులకు దర్శనమిస్తారు. ఆ సమయంలో వేదపండితులు వేదమంత్రాలతో స్వామివారిని కీర్తిస్తారు. నాదస్వరవిద్వాంసులు సుస్వరంగా నాదస్వరాన్ని వినిపిస్తారు. అనంతరం గాయకులు అన్నమాచార్యుల సంకీర్తనలతోను, పురందరదాసు కీర్తనలతోనూ శ్రీవారికి స్వరార్చన చేస్తారు. వేద, నాద, గానాలను ఆలకిస్తూ, మలయప్పస్వామి మెల్లమెల్లగా ఉయ్యాలలూగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

**తిరుమలలో అసంఖ్యాక భక్తులు వీక్షించే ఈ సేవను శ్రీ వేంకటేశ్వరభక్తి ఛానల్ ప్రతిరోజూ సాయంసంధ్యావేళ సా. గం.5.30 ని.లకు ప్రత్యక్ష ప్రసారం చేస్తూ, లక్షలాది భక్తులను ఆనందింపచేస్తున్నది.**

అనంతరం శ్రీవారి ఆలయంలో సాయంకాలం పూజ, తోమాలసేవ జరుగుతుంది. ఈ తోమాలసేవ తర్వాత అర్చకులు శ్రీవారికి అష్టోత్తర శతనామార్చన, వక్షఃస్థల మహాలక్ష్మికి చతుర్వింశతి నామార్చన చేస్తారు. తర్వాత స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించి, బంగారువాకిలి ప్రక్కన ఉన్న ఘంటామండపంలోని పెద్దఘంటలను ఒకేస్థాయిలో గంభీరంగా మ్రోగిస్తారు. ఆ తర్వాత ఏకాంతంగా జరిగే శాత్తుమొరలో జియ్యంగారు, ఏకాంగి మాత్రమే పాల్గొంటారు.

## **ఘంటానాదం**

**ప్రతిరోజు సాయంవేళలో శ్రీవారి నైవేద్య ఘంటానాదం ఇంటింటా ప్రతిధ్వనించాలనే ఉద్దేశంతో శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రతిరోజూ సాయంకాలం 7.30 నుండి 8.00గం॥ల మధ్య ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నది. ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజూ తిలకిస్తున్న భక్తులు తిరుమల క్షేత్రంలో ఉన్న అనుభూతిని పొందుతున్నారు.**

## **ఏకాంతసేవ**

శ్రీవారి ఆలయంలో చివరగా జరిగే సేవ ఏకాంతసేవ. బంగారు పట్టెమంచాన్ని తెచ్చి ఆనందనిలయానికి ముందు ఉన్న శయనమండపంలో వెండిగొలుసులతో వ్రేలాడదీసి దానిపై పట్టుపరుపును, దిండ్లను అమరుస్తారు. ఈ సేవను రా.గం. 11 నుండి గం. 1.00ల మధ్య రద్దీని బట్టి ఆర్జితసేవగా జరుపబడుతుంది.

శ్రీవారి పరమభక్తురాలైన తరిగొండ వెంగమాంబ వంశీయులు ఆ బంగారుపట్టెమంచం చుట్టూ రంగవల్లులు తీర్చిదిద్దుతారు. పిదప మాతృశ్రీ వెంగమాంబ ముత్యాలహారతి పళ్లాన్ని, ఏకాంగివారికి ఇచ్చి వారు బయటకు వస్తారు. సన్నిధిగొల్ల ఈ మంచం ముందు రెండు దీపాలను వెలిగించి బయటకు వస్తాడు.

అర్చకులు రాములవారి మేడ తలుపులు దగ్గరగా వేసి, బంగారువాకిలికి తెరవేస్తారు. అప్పుడు గరుడమండపం దగ్గర సన్నాయిమేళం శ్రవణానందంగా మ్రోగింపబడుతుంది. ఆలయంలోపల అర్చకులు, శ్రీవారికి ఉపచారాలు చేసి, వివిధ ఫలాలతో చక్కెర, తేనె కలిపి తయారుచేసిన ప్రసాదాన్ని, చక్కెర, జీడిపప్పు, బాదంపప్పు, ఎండుద్రాక్ష, యాలకులు, గసగసాలు, ఎండుకొబ్బరి ముక్కలు కలిపి తయారుచేసిన పంచకజ్జాయం అనే ప్రసాదాన్ని, చక్కెర కలిపిన వేడిపాలను నివేదిస్తారు. సుగంధభరిత తాంబూలాన్ని సమర్పించి, కర్పూర నీరాజనాలు సమర్పిస్తారు.

ఆ తర్వాత అర్చకులు మరల శ్రీవారికి పాద నమస్కారం చేసి, అక్కడ ఉన్న భోగశ్రీనివాసమూర్తిని శయనంపైకి వేంచేయవలసిందిగా ప్రార్థించి, పట్టెమంచంపై నుండి భక్తులను చూస్తున్నట్లుగా, దక్షిణం తలాపుగా శయనింప జేస్తారు.

తరువాత శ్రీవారిమూలమూర్తికి ఉన్న బంగారు పాదకవచాలను తీసి, వాటిపై క్రొత్త వస్త్రాన్ని పరిచి, అప్పటికప్పుడు నూరి తీసిన రెండుచందనపు ముద్దలను శ్రీపాదాలకు సమర్పిస్తారు. స్వామివారి వక్షఃస్థల లక్ష్మికి ఒక ముద్ద చందనాన్ని సమర్పించి, అరముద్ద చందనాన్ని శయనించి ఉన్న భోగశ్రీనివాసమూర్తిహృదయంపైన వుంచుతారు. మరొక అరముద్ద చందనాన్ని బ్రహ్మదేవుడు అర్చించడానికి గాను శ్రీవారిపాదాల ముందర బంగారుపళ్ళెంలో ఉంచుతారు.

ఆలయంలోపల ఈ ఏర్పాట్లు జరుగుతూండగా భక్తులు బంగారువాకిళ్ల ముందు కూర్చొని స్వామివారి దర్శనం కోసం ఎదురు చూస్తూంటారు.

అన్ని ఉపచారాలూ పూర్తిఅయిన తర్వాత భోగశ్రీనివాస మూర్తిని పాన్పుపై పవళింపజేసి వాకిలి తీస్తారు. ఆ దివ్యమంగళ సందర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులు శ్రీవారిని, పాన్పుపై పవళించిన భోగశ్రీనివాసమూర్తిని తనివిదీరా దర్శిస్తారు. ఇంతలో తాళ్లపాక అన్నమాచార్యుని వంశీయులొకరు శ్రీస్వామివారికి ఎదురుగా, రాములవారి మేడలోని నడవలో కూర్చొని తంబూర మీటుతూ అన్నమయ్య రచించిన జోలపాటను భక్తితో గానం చేస్తారు.

"జో అచ్యుతానంద జోజో ముకుందా...రావె పరమా నంద రామ గోవిందా...." అంటూ సాగే సంకీర్తనను ఆలకిస్తూ, స్వామివారు యోగనిద్రకు ఉపక్రమిస్తారు. తాళ్లపాక

వారి లాలిపాట పూర్తయిన వెంటనే, తరిగొండవెంగమాంబ వారి ముత్యాలహారతిని శ్రీవారి మూలమూర్తికి, బంగారు మంచంపై శయనించి వున్న భోగమూర్తికి అర్చకులు ఇస్తారు.

తరిగొండవారి కర్పూరహారతి వెలుగులలో, శ్రీవారి దివ్య మంగళవిగ్రహసౌందర్యాన్ని వీక్షించిన భక్తులు అవ్యక్తానందంతో కర్పూర హారతిని కళ్లకు అద్దుకుని శ్రీవారిని, భోగశ్రీనివాసమూర్తిని తిరిగి తిరిగి చూస్తూ వెలుపలికి వస్తారు. శ్రీవారికి నివేదించిన తియ్యని వేడిపాలను, పంచకజ్జాయంప్రసాదాలను స్వీకరించి హుండీమార్గం ద్వారా బయటకు వచ్చి ఆనందనిలయగోపురానికి నమస్కరించి వెళతారు. ఏకాంతసేవానంతరం ఎవరూ విమాన ప్రదక్షిణం చేయరు. ఆ సమయంలో అక్కడ దేవతాసంచారం ఉంటుందని ప్రతీతి!

**అనిర్వచనీయమైన అనుభూతిని, ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసాదించే ఈ శ్రీవారి ఏకాంతసేవను భక్తకోటి వీక్షించాలనే సత్సం కల్పంతో శ్రీవారి అర్చకులతో నమూనా ఆలయంలో ఈ సేవను జరిపి, చిత్రీకరించి మీకందిస్తూంది శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్.**

ఆ తర్వాత అర్చకస్వాములు బ్రహ్మాదిదేవతలు ఏకాం తంగా శ్రీవారిని అర్చించడానికి బ్రహ్మతీర్థాన్ని ఉంచుతారు. లోపల ఎవరూ లేకుండా శోధించి, శ్రీవారికి భక్తిపూర్వక పాదనమస్కారం చేస్తారు. బంగారుపట్టెమంచంలో శయనించి ఉన్న భోగశ్రీనివాసమూర్తికి చేతులు జోడించి, ప్రార్థించి, రాములవారిమేడ తలుపులకు తాళాలు వేసి బంగారువాకిలి బయటికి వస్తారు. అర్చకులు బయటకి రాగానే బంగారువాకిలి మూయబడుతుంది.

సుప్రభాత సమయంలో బంగారువాకిళ్లు ఎలా తీస్తారో, అదేవిధంగా సన్నిధిగొల్ల, అర్చకులు, జియ్యంగార్లు, అధికారుల సమక్షంలో బంగారువాకిళ్లకు నాలుగు గడియలు వేసి పెద్దపెద్ద తాళాలు, వాటికి లక్కతో సీళ్లు వేస్తారు. అనంతరం అందరూ ధ్వజస్తంభం వద్దకు రాగానే వెండివాకిళ్లను కూడా మూసి, తాళాలు, సీళ్లు వేస్తారు. ఆలయసిబ్బంది, రక్షకులు అందరూ ఈ వెండివాకిలికి ఇవతలే రాత్రంతా కాపలా కాస్తుంటారు.

అర్చకులు ధ్వజస్తంభ, బలిపీఠాలకు ప్రదక్షిణంగా బయ టికి వెళుతూ, తమ వద్ద ఉన్న తాళాలను, కుంచెకోలను, క్షేత్ర పాలకశిలకు మూడుమార్లు తాకించి సెలవిమ్మని భక్తితో ప్రార్థించి, మహాద్వారం దాటి బయటికి వెళతారు. దీనితో తిరుమల శ్రీనివాస స్వామివారి నిత్యసేవలు, ఆలయ దినచర్యలు పూర్తవుతాయి.

అనంతరం మహాద్వారం తలుపులు మూయబడతాయి. ఆ నిశ్శబ్ద ప్రశాంత సమయంలో బ్రహ్మాది దేవతలు, యక్ష, కిన్నర, గంధర్వాదులు అదృశ్యంగా వచ్చి, శ్రీనివాస ప్రభువును సేవించి వెళతారని పురాణ ప్రశస్తి. తరతరాలుగా ఈ విషయాన్ని తిరుమల క్షేత్రంలోని పెద్దలు చెబుతున్న సత్యమైన వాక్కు.

మానవులచేత, బ్రహ్మాది దేవతలచేత, నిరంతరాయంగా సేవింపబడుతూ అందరినీ సంపూర్ణంగా అనుగ్రహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సాటిరాగల దేవుడు ఇంకొకడు లేడు. భవిష్యత్తులో రాడు. ఆ దేవునికి సాటి ఆ దేవుడే.

శ్లో॥ శ్రియకాంతాయ కల్యాణనిధయే నిధయేర్థి నామ్ ।
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

## శ్రీవారి వారోత్సవాలు

శ్రీవేంకటేశ్వరస్వామివారికి వారానికి ఒకమారు మాత్రమే తప్పనిసరిగా జరిగే వారోత్సవాలు కొన్ని ఉన్నాయి. ఇలా ఆయా వారాల్లో జరిగే ఆయా సేవలను గూర్చి తెలుసు కుందాం.

### సోమవారం - విశేషపూజ

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతిసోమవారం ఉదయం 6గంటలకు జరిగే ప్రధానసేవ **"విశేషపూజ".** ఈ సేవ సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపంలో శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీ మలయప్పస్వామివారికి జరుగుతుంది.

ప్రతిసోమవారం జరిగే ఈ సేవ 1991 ఏప్రియల్ 8న ప్రారంభింపబడి, ఆర్జితసేవగా కూడా రూపుదిద్దుకుంది.

శ్రీవారి ఆలయంలో రెండవ అర్చన, రెండవ నైవేద్యం అయిన తర్వాత దేవేరులతో కూడి శ్రీ మలయప్పస్వామి కల్యాణ మండపానికి వేంచేస్తారు. వైఖానసాగమ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించిన పిదప శ్రీస్వామివారలకు (స్నపన) తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సేవలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు ఇస్తారు.

### మంగళవారం - అష్టదళ పాదపద్మారాధన

ప్రతిమంగళవారం ఉదయం 6గంటలకు రెండవ అర్చనగా 108 బంగారు కమలాలతో మూలవిరాట్టుకు జరిగే అర్చనా కార్యక్రమమే "అష్టదళ పాదపద్మారాధన". ఇది సుమారు 20 నిమిషాలపాటు జరుగుతుంది.

1984వ సంవత్సరంలో తి.తి.దేవస్థానం స్వర్ణోత్సవ సందర్భంగా ప్రవేశపెట్టబడిన సేవ ఇది. హైదరాబాదు వాస్తవ్యుడు, ఒక మహమ్మదీయ భక్తుడు ఇందుకు అవసరమైన 108 బంగారు పద్మాలను కానుకగా సమర్పించాడు. తర్వాత ఇది ఆర్జితసేవగా కూడా రూపుదిద్దుకొంది.

108 బంగారు కమలాలతో అష్టోత్తర శతనామాలతో అర్చన జరుగుతుండగా భక్తులు నయనానందకరంగా శ్రీస్వామివారిని దర్శించవచ్చు.

### బుధవారం - సహస్ర కలశాభిషేకం

ప్రతి బుధవారం ఉదయం 6 గంటలకు తిరుమలలో బంగారువాకిలి ముందు జరిగే ప్రధానసేవయే **"సహస్ర కలశాభిషేకం".** భోగశ్రీనివాసమూర్తితో పాటు శ్రీదేవీ భూదేవీ సమేతంగా, శ్రీ మలయప్పస్వామివారికి ఈ సహస్రకలశాభిషేకం జరుగుతుంది. 1511వ సంవత్సరం నాటికి ముందు నుండి ఈ సహస్ర కలశాభిషేకం జరుగుతున్నట్లు

దాఖలాలున్నాయి.

బంగారువాకిలి ముందు జరిగే ఈ సహస్ర కలశా భిషేకంలో ఆర్జితరుసుమును చెల్లించిన భక్తులుకూడా పాల్గొని దర్శించవచ్చు. వీరికి శ్రీవారి దర్శనం కలిగించి ప్రసాదాలు ఇస్తారు.

## గురువారం - తిరుప్పావడ

### నేత్రదర్శనం

ప్రతి గురువారం శ్రీవేంకటేశ్వరస్వామివారికి రెండవ అర్చనానంతరం జరిగే నివేదనే "తిరుప్పావడ సేవ" అనీ, "అన్నకూటోత్సవ"మనీ అంటారు.

గురువారం ఉదయం 6గంటలకు శ్రీస్వామివారి మూలవిరాట్టుకు ఉన్న ఆభరణాలను అన్నింటినీ తీసివేస్తారు. పిదప ఊర్ధ్వపుండ్రాన్ని కూడా బాగా తగ్గించి నేత్రాలు స్పష్టంగా కనపడేట్లు చేస్తారు. తర్వాత శ్రీస్వామివారికి ఎదురుగా బంగారువాకిలి ముందర పెద్దశిఖరంలాగా పులిహోర రాశిని ఏర్పాటుచేస్తారు. పులిహోరతోబాటు జిలేబీలను, మురుకులను చక్కగా అమర్చి పూలతో అలంకరిస్తారు. ఈ పులిహోర రాశిని నేరుగా గర్భాలయంలోని స్వామివారికి నివేదిస్తారు.

ఈ సేవలో ఆర్జితం చెల్లించిన భక్తులుకూడా పాల్గొనవచ్చు. ఈసేవలో వేదపండితులు వేదపారాయణంతోపాటు శ్రీనివాసగద్యం పఠిస్తారు.

ఆ తర్వాత భక్తులందరికీ, తిరుప్పావడసేవతో బాటు శ్రీవారి నేత్రదర్శనం పొందే అవకాశం కల్గుతుంది.

## పూలంగిసేవ

ప్రతిగురువారం రాత్రి 8 గంటలకు శ్రీవారికి జరిగే తోమాలసేవను **"పూలంగిసేవ"** అంటారు. అయితే ఈ సేవ మాత్రం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది. జియ్యంగార్లు అందించే పూలమాలతో అర్చకులు శ్రీవారి విగ్రహాన్ని మొత్తం అలంకరిస్తారు. శ్రీస్వామివారు పూలంగి తొడిగినట్లుగా ఉంటారు. పూలంగిసేవ అలంకరణం అయిన తర్వాత ప్రతి గురువారం రాత్రి యాత్రికులు పూలంగి అలంకరణలో ఉన్న శ్రీస్వామివారిని నయనానందంగా దర్శింపవచ్చు.

## శుక్రవారాభిషేకం

శ్రీవేంకటేశ్వర స్వామివారి మూలమూర్తికి ప్రతిశుక్ర వారం తెల్లవారు జామున 4 గంll లకు జరిగే అభిషేకమే **"శుక్ర వారాభిషేకం".**

ప్రతిశుక్రవారం విశేషోత్సవంగా జరుపబడే ఈ అభి షేకం 614వ సంవత్సరానికి పూర్వంనుండే జరిగేదని తెలుస్తున్నది.

విశేషసందర్భాల్లో జరిగే ఈ శుక్రవారాభిషేకాన్ని, భగ వద్రామానుజులవారు శ్రీస్వామివారి వక్షఃస్థలంలో **"బంగారు అల మేలుమంగ"** ప్రతిమను అలంకరింపజేసిన శుక్రవారం మొదలుగా ప్రతిశుక్రవారంనాడు ఈ అభిషేకం జరిగేట్లు ఏర్పాటుచేశారట.

### ఆకాశగంగాతీర్థంతో అభిషేకం

పూర్వం శ్రీవారినిత్యాభిషేక కైంకర్యంతో తరించిన మహాభక్తుడైన తిరుమలనంబి వంశీయుడు అందించిన కలశ తీర్థాన్ని తొలుత జియ్యంగారు స్వీకరించి భక్తిప్రపత్తులతో బంగారు శంఖంతో అందించగా ఆ ఆకాశగంగ తీర్థాన్ని అర్చకస్వాములు శ్రీవారిశిరస్సుపై సమర్పిస్తూ హరిః ఓం సహస్రశీర్షా పురుషః అని పురుష సూక్తాన్ని ప్రారంభిస్తారు. కులశేఖరపడికి ఇవతల ఉన్న విద్వాంసులు పురుషసూక్తం అందుకుని అభిషేకం జరుగుతున్నంత సేపు పంచసూక్తాలను పఠిస్తూనే ఉంటారు. ఆకాశగంగాతీర్థంతో అభిషేకించబడుతున్న శ్రీవారి దివ్యమంగళమూర్తిని వీక్షిస్తున్న భక్తులు ఆ అభిషేకం తామే చేస్తున్నట్లుగా భావిస్తూ తన్మయులౌతారు.

పునుగు, కస్తూరి, జవ్వాది మున్నగు సుగంధద్రవ్యాలతో, ఆకాశగంగా తీర్థంతో, సుమారు ఒక గంటపాటు అభిషేకం జరుగుతుంది. ఆ తర్వాత పసుపుతో శ్రీవారి వక్షఃస్థలం మీద ఉన్న మహాలక్ష్మికికూడా ఈ అభిషేకం జరుగుతుంది.

ఎప్పుడో, ఏనాడో బ్రహ్మాది దేవతల కోరికమేరకు కలియుగ మానవులకోసం వెలసిన శ్రీనివాసుని యథాతథమైన రూపాన్ని వక్షఃస్థల లక్ష్మితో కూడా ఈ శుక్రవారాభిషేక సమయంలో మాత్రమే దర్శించ వీలవుతుంది.

అభిషేకం అయిన తర్వాత శ్రీస్వామివారిమెడలో ఉన్న బంగారు అలమేలుమంగకు కూడాఅభిషేకం జరుగుతుంది. ఆర్జితసేవగా జరుపబడుతున్న ఈ అభిషేకోత్సవం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది.

అభిషేకానంతరం భక్తులందరిమీదా అభిషేకతీర్థాన్ని సంప్రోక్షించడంతో అభిషేకదర్శనం పూర్తవుతుంది.

## నిజపాద దర్శనం

ప్రతి శుక్రవారం అభిషేకానంతరం, అభిషేక సేవలో పాల్గొన్న గృహస్థులు శ్రీస్వామివారిని దర్శించి వెళ్లిన తర్వాత **'నిజపాద దర్శనం'** ప్రారంభమవుతుంది.

**ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు ఈ సేవలో పాల్గొని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నిజపాదాలను అంటే (ఎలాంటి తొడుగులు లేకుండా) దర్శించవచ్చు. ఈ దర్శనంలో మాత్రమే శ్రీవారి నిజపాదాలు దర్శించుటకు అవకాశముంటుంది. మిగిలిన వేళల్లో ఆ పాదాలు బంగారు తొడుగులతో విరాజిల్లుతూ ఉంటాయి.**

**ఈ అభిషేక సేవను శ్రీవారి నమూనాఆలయంలో చిత్రీకరించి, ప్రసారం చేస్తూంది శ్రీ వేంకటేశ్వరభక్తిఛానల్. భక్తులు వీక్షించి తరించగలరు.**

## శ్రీ వేంకటేశ్వర పూజాకల్పం

**శ్లో॥ శ్రీవేంకటాచలాధీశం శ్రియాఽఽధ్యాసిత వక్షసమ్ ।**
**శ్రితచేతన మందారం శ్రీనివాస మహంభజే ॥**

**శ్రియఃకాంతాయ కల్యాణ నిథయేనిథయేఽర్థినామ్ ।**
**శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

**శ్రీ వేంకటాద్రినిలయః కమలాకాముకః పుమాన్ ।**
**అభంగురవిభూతి ర్నః తరంగయతు మంగళమ్ ॥**

**నమో నమస్తే అఖిలకారణాయ**
**నమో నమస్తే అఖిలపాలకాయ ।**
**నమో నమస్తే సురనాయకాయ**
**నమో నమో దైత్యవిమర్దనాయ ॥**

**నమో నమో భక్తజనప్రియాయ**
**నమో నమః పాపవిదారణాయ ।**
**నమో నమో దుర్జననాశకాయ**
**నమోఽస్తు తస్మై జగదీశ్వరాయ ॥**

### సంకల్పం

శుభ తిథౌ శోభనముహూర్తే ఆద్యబ్రహ్మణః ద్వితీయపరార్థే శ్వేతవరాహకల్పే వైవస్వతమన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరతవర్షే భరతఖండే అస్మిన్ వర్తమాన వ్యావహారిక ప్రభవాది షష్టిసంవత్సరాణాం మధ్యే................ సంవత్సరే.......... అయనే........... ఋతౌ.............. మాసే...............పక్షే............. ..........తిథౌ............... వాసరయుక్తాయాం..............శుభనక్షత్రే శుభయోగ శుభకరణ ఏవంగుణ విశేషణ విశిష్టాయాం అస్యాం శుభతిథౌ మమ ధర్మార్థ కామమోక్ష చతుర్విధ, ఫలపురుషార్థ సిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభివృద్ధ్యర్థం, ఆయుష్యాభివృద్ధ్యర్థం, మనోవాంఛాఫలసిద్ధ్యర్థం శ్రీశ్రీనివాస స్వామినః అనుగ్రహప్రసాదసిద్ధిద్వారా సర్వారిష్టనివారణార్థం, సర్వాభీష్టఫలసిద్ధ్యర్థం శ్రీవేంకటేశ్వరస్వామినః ప్రీత్యర్థం ధ్యానావాహనాది **షోడశోపచారపూజాం కరిష్యే ।**

### శ్రీ వేంకటేశ సుప్రభాతమ్

కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే ।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్ ॥ 1

ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ ।
ఉత్తిష్ఠ కమలాకాంత త్రైలోక్యం మంగళం కురు ॥ 2

మాత స్సమస్తజగతాం మధుకైటభారేః
వక్షోవిహారిణి మనోహరదివ్యమూర్తే ।
శ్రీస్వామిని శ్రితజన ప్రియదానశీలే
శ్రీవేంకటేశదయితే తవ సుప్రభాతమ్ ॥ 3

తవ సుప్రభాత మరవిందలోచనే
భవతు ప్రసన్నముఖచంద్రమండలే ।
విధిశంకరేంద్రవనితాభి రర్చితే
వృషశైలనాథదయితే దయానిధే ॥ 4

అత్ర్యాదిసప్త ఋషయ స్సముపాస్య సంధ్యాం
ఆకాశసింధు కమలాని మనోహరాణి ।
ఆదాయ పాదయుగ మర్చయితుం ప్రపన్నాః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥ 5

పంచాననాబ్జభవషణ్ముఖవాసవాద్యాః
త్రైవిక్రమాదిచరితం విబుధాః స్తువంతి ।
భాషాపతిః పఠతి వాసర శుద్ధిమారాత్
శేషాద్రిశేఖర విభో తవ సుప్రభాతమ్ ॥ 6

ఈషత్ప్రఫుల్లసరసీరుహనారికేళ
పూగద్రుమాదిసుమనోహరపాలికానామ్ ।
ఆవాతి మందమ నిలః సహదివ్యగంధైః
శేషాద్రిశేఖర విభో తవ సుప్రభాతమ్ ॥ 7

ఉన్మీల్య నేత్రయుగ ముత్తమపంజరస్థాః
పాత్రావశిష్టకదళీఫలపాయసాని ।
భుక్త్వా సలీల మథ కేళిశుకాః పఠంతి
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥ 8

తంత్రీప్రకర్షమధురస్వనయా విపంచ్యా
గాయ త్యనంత చరితం తవ నారదోఽపి ।
భాషాసమగ్ర మసకృత్కరచారరమ్యం
శేషాద్రిశేఖర విభో తవ సుప్రభాతమ్ ॥ 9

భృంగావళీ చ మకరందరసానువిద్ధ
ఝుంకారగీతనినదైః సహ సేవనాయ ।
నిర్యా త్యుపాంతసరసీకమలోదరేభ్యః

శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥ 10

యోషాగణేన వరదధ్ని విమథ్యమానే
ఘోషాలయేషు దధిమంథనతీవ్రఘోషాః
రోషాత్కలిం విదధతే కకుభశ్చ కుంభాః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥ 11

పద్మేశ మిత్ర శతపత్రగతాళివర్గాః
హర్తుం శ్రియం కువలయస్య నిజాంగలక్ష్మ్యా ।
భేరీనినాదమివ బిభ్రతి తీవ్రనాదం
శేషాద్రిశేఖర విభో తవ సుప్రభాతమ్ ॥ 12

శ్రీమన్నభీష్టవరదాఖిలలోకబంధో
శ్రీ శ్రీనివాస జగదేక దయైక సింధో ।
శ్రీదేవతాగృహభుజాంతరదివ్యమూర్తే
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 13

శ్రీస్వామిపుష్కరిణికాఽఽప్లవనిర్మలాంగాః
శ్రేయోఽర్థినో హరవిరించిసనందనాద్యాః ।
ద్వారే వసంతి వరవేత్రహతోత్తమాంగాః
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 14

శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి-
నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్ ।
ఆఖ్యాం త్వదీయవసతే రనిశం వదంతి
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 15

సేవాపరాః శివసురేశకృశానుధర్మ-
రక్షోఽంబునాథపవమానధనాధినాథాః ।
బద్ధాంజలిప్రవిల సన్నిజశీర్ష దేశాః
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 16

ధాటీషు తే విహగరాజమృగాధిరాజ-
నాగాధిరాజ గజరాజ హయాధిరాజాః ।
స్వస్వాధికారమహిమాదిక మర్థయంతే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 17

సూర్యేందుభౌమ బుధవాక్పతికావ్యసౌరి-
స్వర్భాను కేతు దివిషత్పరిషత్ప్రధానాః ।
త్వద్దాసదాస చరమావధిదాసదాసాః
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 18

త్వత్పాదధూళిభరితస్ఫురితోత్తమాంగాః
స్వర్గాపవర్గనిరపేక్షనిజాంతరంగాః ।
కల్పాగమాఽఽకలనయాఽఽకులతాం లభంతే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 19

త్వద్గోపురాగ్రశిఖరాణి నిరీక్షమాణాః
స్వర్గాపవర్గపదవీం పరమాం శ్రయంతః ।
మర్త్యా మనుష్యభువనే మతి మాశ్రయంతే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 20

శ్రీ భూమినాయక దయాదిగుణామృతాబ్ధే
దేవాధిదేవ జగదేకశరణ్యమూర్తే ।
శ్రీమన్ననంతగరుడాదిభిరర్చితాంఘ్రే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 21

శ్రీపద్మనాభ పురుషోత్తమ వాసుదేవ-
వైకుంఠ మాధవ జనార్దన చక్రపాణే ।
శ్రీవత్సచిహ్న శరణాగతపారిజాత
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 22

కందర్పదర్పహరసుందరదివ్యమూర్తే
కాంతాకుచాంబురుహకుట్మలలోలదృష్టే ।
కల్యాణనిర్మలగుణాకర దివ్యకీర్తే
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 23

మీనాకృతే కమఠ కోల నృసింహ వర్ణిన్
స్వామిన్ పరశ్వథ తపోధన రామచంద్ర
శేషాంశరామ యదునందన కల్కిరూప
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 24

ఏలా లవంగ ఘనసార సుగంధితీర్థం
దివ్యం వియత్సరితి హేమఘటేషు పూర్ణమ్ ।
ధృత్వాఽద్య వైదికశిఖామణయః ప్రహృష్టాః
తిష్ఠంతి వేంకటపతే తవ సుప్రభాతమ్ 25

భాస్వానుదేతి వికచాని సరోరుహాణి
సంపూరయంతి నినదైః కకుభో విహంగాః ।
శ్రీవైష్ణవా స్సతత మర్థిత మంగళాస్తే

ధామాశ్రయంతి తవ వేంకట సుప్రభాతమ్ ॥ 26

బ్రహ్మాదయస్సురవరాస్సమహర్షయ స్తే
సంతస్సనందనముఖా స్త్వథ యోగివర్యాః ।
ధామాంతికే తవ హి మంగళవస్తుహస్తాః
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 27

లక్ష్మీనివాస నిరవద్యగుణైకసింధో
సంసారసాగరసముత్తరణైకసేతో
వేదాంతవేద్యనిజవైభవభక్తభోగ్య
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 28

ఇత్థం వృషాచలపతే రిహ సుప్రభాతం
యే మానవాః ప్రతిదినం పఠితుం ప్రవృత్తాః ।
తేషాం ప్రభాతసమయే స్మృతి రంగభాజాం
ప్రజ్ఞాం పరార్థసులభాం పరమాం ప్రసూతే ॥ 29

## శ్రీ వేంకటేశ స్తోత్రమ్

కమలాకుచచూచుకకుంకుమతో
నియతారుణితాతులనీలతనో ।
కమలాయతలోచన లోకపతే
విజయీ భవ వేంకటశైలపతే ॥ 1

స చతుర్ముఖ షణ్ముఖ పంచముఖ-
ప్రముఖాఖిలదైవతమౌళిమణే ।
శరణాగతవత్సల సారనిధే
పరిపాలయ మాం వృషశైలపతే ॥ 2

అతివేలతయా తవ దుర్విషహైః
అనువేలకృతై రపరాధశతైః ।
భరితం త్వరితం వృషశైలపతే
పరయా కృపయా పరిపాహి హరే 3

అధివేంకటశైల ముదారమతేః
జనతాభిమతాధికదానరతాత్ ।
పరదేవతయా గదితాన్నిగమైః
కమలాదయితా న్న పరం కలయే ॥ 4

కలవేణురవావశగోపవధూ
శతకోటివృతాత్స్మరకోటిసమాత్ ।
ప్రతివల్లవికాఽభిమతా త్సుఖదాత్
వసుదేవసుతా న్న పరం కలయే ॥ 5

అభిరామగుణాకర దాశరథే
జగదేక ధనుర్ధర ధీరమతే ।
రఘునాయక రామ రమేశ విభో
వరదో భవ దేవ దయాజలధే ॥ 6

అవనీతనయాకమనీయకరం
రజనీకరచారుముఖాంబురుహమ్ ।
రజనీచరరాజతమోమిహిరం
మహనీయమహం రఘురామమయే ॥ 7

సుముఖం సుహృదం సులభం సుఖదం
స్వనుజం చ సుకాయ మమోఘశరమ్ ।
అపహాయ రఘూద్వహ మన్య మహం
న కథంచన కంచన జాతు భజే ॥ 8

వినా వేంకటేశం ననాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।
హరే వేంకటేశ ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ 9

అహం దూరతస్తే పదాంభోజయుగ్మ
ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాం కరోమి ।
సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం
ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ ॥ 10

అజ్ఞానినా మయా దోషా నశేషా న్విహితాన్ హరే ।
క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైలశిఖామణే ॥ 11

## శ్రీ వేంకటేశ ప్రపత్తిః

ఈశానాం జగతోఽస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థలనిత్యవాసరసికాం తత్ క్షాంతి సంవర్ధినీమ్ ।

పద్మాలంకృతపాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్ ॥ 1

శ్రీమన్ కృపాజలనిధే కృతసర్వలోక ।
సర్వజ్ఞ శక్త నతవత్సల సర్వశేషిన్
స్వామిన్ సుశీల సులభాశ్రితపారిజాత
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 2

ఆనూపురార్పితసుజాతసుగంధిపుష్ప-
సౌరభ్యసౌరభకరౌ సమసన్ని వేశౌ
సౌమ్యౌ సదానుభవనేఽ పి నవానుభావ్యౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 3

సద్యో వికాసి సముదిత్వరసాంద్రరాగ-
సౌరభ్యనిర్భరసరోరుహసామ్యవార్తామ్ ।
సమ్యక్షు సాహసపదేషు విలేఖయంతౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 4

రేఖామయధ్వజసుధాకలశాతపత్ర-
వజ్రాంకుశాంబురుహకల్పకశంఖచక్రైః
భవ్యై రలంకృతతలౌ పరతత్త్వచిహ్నైః
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 5

తామ్రోదరద్యుతిపరాజితపద్మరాగౌ
బాహ్యై ర్మహోభి రభిభూతమహేంద్రనీలౌ ।
ఉద్యన్నఖాంశుభి రుదస్త శశాంకభాసౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 6

సప్రేమభీతి కమలాకరపల్లవాభ్యాం
సంవాహనేఽ పి సపది క్లమ మాదధానౌ ।
కాంతావవాఙ్మనసగోచర సౌకుమార్యౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 7

లక్ష్మీ మహీతదనురూప నిజానుభావ
నీళాది దివ్యమహిషీకరపల్లవానామ్ ।
ఆరుణ్య సంక్రమణతః కిల సాంద్రరాగౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 8

నిత్యానమద్విధిశివాదికిరీటకోటి-
ప్రత్యుప్తదీప్త నవరత్న మహః ప్రరోహైః ।
నీరాజనావిధి ముదార ముపాదధానౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 9

“విష్ణోః పదే పరమ ” ఇత్యుదిత ప్రశంసౌ
యౌ “మధ్వ ఉత్స ” ఇతి భోగ్యతయాఽ ప్యుపాత్తౌ ।
భూయ స్తథేతి తవ పాణితల ప్రదిష్టౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 10

పార్థాయ తత్సదృశ సారథినా త్వయైవ
యౌ దర్శితౌ స్వచరణౌ శరణం వ్రజేతి
భూయోఽ పి మహ్య మిహ తౌ కరదర్శితౌ తే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 11

మన్మూర్ధ్ని కాళియఫణే వికటాటవీషు
శ్రీ వేంకటాద్రిశిఖరే శిరసి శ్రుతీనామ్ ।
చిత్తే ప్యనన్య మనసాం సమ మాహితౌ తే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 12

అమ్లానహృష్య దవనీతలకీర్ణపుష్పౌ
శ్రీ వేంకటాద్రి శిఖరాభరణాయమానౌ ।
ఆనందితాఖిలమనోనయనౌ తవైతౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 13

ప్రాయః ప్రపన్న జనతా ప్రథమావగాహ్యౌ
మాతుః స్తనావివ శిశో రమృతాయమానౌ
ప్రాప్తౌ పరస్పరతులా మతులాంతరౌ తే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 14

సత్త్వోత్తరై స్సతత సేవ్యపదాంబుజేన
సంసార తారక దయార్ద్రదృగంచలేన ।
సౌమ్యోపయంతృమునినా మమ దర్శితౌ తే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥ 15

శ్రీశ శ్రియా ఘటికయా త్వదుపాయభావే
ప్రాప్యేత్వయి స్వయముపేయ తయా స్ఫురంత్యా ।
నిత్యాశ్రితాయ నిరవద్యగుణాయ తుభ్యం
స్యాం కింకరో వృషగిరీశ న జాతు మహ్యమ్ ॥ 16

## శ్రీ వేంకటేశ మంగళాశాసనమ్

శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్ ।

శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥ 1

లక్ష్మీసవిభ్రమాలోకసుభ్రూవిభ్రమచక్షుషే
చక్షుషే సర్వలోకానాం వేంకటేశాయ మంగళమ్ ॥ 2

శ్రీ వేంకటాద్రిశృంగాగ్రమంగళాభరణాంఘ్రయే ।
మంగళానాం నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥ 3

సర్వావయవసౌందర్యసంపదా సర్వచేతసామ్ ।
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥ 4

నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే ।
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥ 5

స్వతస్సర్వవిదే సర్వశక్తయే సర్వశేషిణే ।
సులభాయ సుశీలాయ వేంకటేశాయ మంగళమ్ ॥ 6

పరస్మై బ్రహ్మణే పూర్ణకామాయ పరమాత్మనే ।
ప్రయుంజే పరతత్త్వాయ వేంకటేశాయ మంగళమ్ ॥ 7

ఆకాలతత్త్వ మశ్రాంత మాత్మనా మనుపశ్యతామ్ ।
అతృప్త్యమృతరూపాయ వేంకటేశాయ మంగళమ్ ॥ 8

ప్రాయః స్వచరణౌ పుంసాం శరణ్యత్వేన పాణినా ।
కృపయాఽఽదిశతే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥ 9

దయాఽమృత తరంగిణ్యా స్తరంగై రివ శీతలైః ।
అపాంగై స్సించతే విశ్వం వేంకటేశాయ మంగళమ్ ॥ 10

స్రగ్భూషాంబర హేతీనాం సుషమావహమూర్తయే ।
సర్వార్తిశమనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥ 11

శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే ।
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥ 12

శ్రీమత్సుందరజామాతృ మునిమానస వాసినే ।
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥ 13

మంగళాశాసనపరై ర్మదాచార్యపురోగమైః ।
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥ 14

**ధ్యానం**

ఓం నమో దేవదేవాయ పూర్వదేవాయ ఖడ్గినే
శ్రీవత్సాంకాయ చ నమః పరస్మై పరమాత్మనే ।

నమః పరస్మైవ్యూహవ్యూహాంతర విభూతమ్
విభవాయ నమస్తస్మై విశ్వాంతర్యామిణే అణవే ॥

ప్రసీద పుండరీకాక్ష ప్రసీద పురుషోత్తమ
ప్రసీద పరమానంద ప్రసీద పరమేశ్వర ।
ప్రసీద కమలాకాంత ప్రసీద కరుణాకర
ప్రసీద భక్తార్తిహర ప్రసీద విబుధర్షభ ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః ధ్యాయామి ।**

అత్రాగచ్ఛ జగద్వంద్య! సురరాజార్చితేశ్వర!
భక్తార్తపాలనపర! ప్రణతార్తిహర! ప్రభో !

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః ఆవాహయామి ।**

మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితమ్ ।
రత్నసింహాసనం చారు ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్ ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః ఆసనం సమర్పయామి।**

నమస్తే దేవదేవేశ! పురాణ పురుషోత్తమ !
గృహాణార్ఘ్యం మయాదత్తం గంధపుష్పాక్షతైర్యుతమ్ ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః అర్ఘ్యం సమర్పయామి।**

అహం దూరత స్తే పదాంభోజయుగ్మ
ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాం కరోమి ।
సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం
ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో! వేంకటేశ!

**శ్రీపద్మావతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామినే నమః**
**పాద్యం సమర్పయామి।**

ఓం నమో దేవదేవాయ పూర్వదేవాయ ఖడ్గినే
శ్రీవత్సాంకాయ చ నమః పరస్మై పరమాత్మనే ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః**
**ఆచమనీయం సమర్పయామి।**

దధిక్షీరసమాయుక్తం మధ్వాజ్యేన సమన్వితమ్ ।
మధుపర్కం గృహాణేదం నారాయణ నమోఽస్తు తే ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః**
**మధుపర్కం సమర్పయామి।**

సువర్ణముఖరీ తీరస్థం సువర్ణేఢ్యం సువర్ణదమ్
సువర్ణాభం సువర్ణాంగం శ్రీనివాసం భజేఽ నిశమ్ ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః**
**పంచామృతస్నానం సమర్పయామి।**

వేదాత్మా వేదవిత్ వేద్యో వైద్యోవేదవిదాంవరః ।
వేదాంత వేద్యరూపాయ బ్రహ్మరూపాయ తే నమః ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః**
**శుద్ధోదకస్నానం సమర్పయామి।**

శరీరభృత్ శరీర త్వం శరీరాత్మా శరీరగః
శారీరకర్మణాస్పృష్టః శుద్ధమూర్తే నమోఽస్తు తే ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః వస్త్రయుగ్మం సమర్పయామి।**

పరస్మై బ్రహ్మణే తుభ్యం నమో యజ్ఞస్వరూపిణే
నమో భవ్యాయ తే నిత్యం శ్రీవత్సాంకితవక్షసే ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః యజ్ఞోపవీతం సమర్పయామి।**

చందనాగరు కర్పూర కస్తూరీ కుంకుమాన్వితమ్ ।
విలేపనం సురశ్రేష్ఠ ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్ ॥

**శ్రీపద్మావతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామినే నమః**
**గంధాన్ ధారయామి ।**

లక్ష్మీమహీ సేవిత వేంకటేశ!
కృపానిధే కృష్ణ! జగత్త్రయేశ!
మాం పాలయాఽ నాథమనాథ బంధో
నమోనమ స్తే చరణాంబుజాయ।

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినేనమః అక్షతాన్ సమర్పయామి।**

పాహి మాం వేంకటాధీశ ప్రణతార్తిప్రభంజన ।
ఆత్మబంధో! కృపాసింధో! సతతం తే నమోనమః ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః పుష్పైః పూజయామి।**

- - -

# అష్టోత్తర శతనామావళి:

ఓం వేంకటేశాయ శ్రీ వేంకటేశాయ నమ:
ఓం శేషాద్రినిలయాయ ॥
ఓం వృషద్గోచరాయ ॥
ఓం విష్ణవే ॥
ఓం సదంజనగిరీశాయ ॥
ఓం వృషాద్రిపతయే ॥
ఓం మేరుపుత్రగిరీశాయ ॥
ఓం సరస్స్వామితటీజుషే ॥
ఓం కుమారాకల్పసేవ్యాయ ॥
ఓం వజ్రదృగ్విషయాయ ॥
ఓం సువర్చలాసుతన్యస్తసైనాపత్యభరాయ ॥
ఓం రామాయ ॥
ఓం పద్మనాభాయ ॥
ఓం సదావాయుస్తుతాయ ॥
ఓం త్యక్తవైకుంఠలోకాయ ॥
ఓం గిరికుంజవిహారిణే ॥
ఓం హరిచందనగోత్రేంద్ర స్వామినే ॥
ఓం శంఖరాజన్య నేత్రాబ్జవిషయాయ ॥
ఓం వసూపరిచరిత్రాత్రే ॥
ఓం కృష్ణాయ ॥
ఓం అబ్ధికన్యాపరిష్వక్తవక్షసే ॥
ఓం వేంకటాయ ॥
ఓం సనకాదిమహాయోగి పూజితాయ ॥
ఓం దేవజిత్ప్రముఖానంతదైత్య సంఘప్రణాశినే॥
ఓం శ్వేతద్వీపవసన్ముక్తపూజితాంఘ్రియుగాయ ॥
ఓం శేషపర్వతరూపత్వ ప్రకాశనపరాయ ॥
ఓం సానుస్థాపిత తార్క్ష్యాయ ॥
ఓం తార్క్ష్యాచలనివాసినే ॥
ఓం మాయాగూఢవిమానాయ ॥
ఓం గరుడస్కంధవాసినే ॥ 30
ఓం అనంతశిరసే ॥
ఓం అనంతాక్షాయ ॥
ఓం అనంతచరణాయ ॥
ఓం శ్రీశైలనిలయాయ ॥
ఓం దామోదరాయ ॥
ఓం నీలమేఘనిభాయ ॥
ఓం బ్రహ్మాదిదేవదుర్దర్శవిశ్వరూపాయ ॥
ఓం వైకుంఠాగత సద్హేమవిమానాంతర్గతాయ ॥

ఓం అగస్త్యాభ్యర్థితానీతా శేషజనదృగ్గోచరాయ ॥
ఓం వాసుదేవాయ ॥ 40
ఓం హరయే ॥
ఓం తీర్థపంచకవాసినే ॥
ఓం వామ దేవప్రియాయ ॥
ఓం జనకేష్టప్రదాయ ॥
ఓం మార్కండేయమహాతీర్థజాతపుణ్యప్రదాయ ॥
ఓం వాక్పతిబ్రహ్మదాత్రే ॥
ఓం చంద్రలావణ్యదాయినే ॥
ఓం నారాయణనగేశాయ ॥
ఓం బ్రహ్మక్లుప్తోత్సవాయ ॥
ఓం శంఖచక్రవరానమ్రలసత్కరతలాయ ॥
ఓం ద్రవన్మృగమదాసక్తవిగ్రహాయ ॥
ఓం కేశవాయ ॥
ఓం నిత్యయవ్వనమూర్తయే ॥
ఓం అర్థితార్థప్రదాత్రే ॥
ఓం విశ్వతీర్థాఘహారిణే ॥
ఓం తీర్థస్వామి సరస్స్నాత జనాభీష్టప్రదాయినే ॥
ఓం కుమారధారికావాసస్కందాభీష్టప్రదాయ ॥
ఓం జానుదఘ్నసముద్భూతపోత్రిణే ॥
ఓం కూర్మమూర్తయే ॥
ఓం కిన్నరద్వంద్వశాపాంతప్రదాత్రే ॥
ఓం విభవే ॥
ఓం వైఖానసమునిశ్రేష్ఠపూజితాయ ॥
ఓం సింహాచల నివాసాయ ॥
ఓం శ్రీమన్నారాయణాయ ॥
ఓం సద్భక్తనీలకంఠార్చ్యనృసింహాయ ॥
ఓం కుముదాక్షగణ శ్రేష్ఠసైనాపత్యప్రదాయ ॥
ఓం దుర్మేధఃప్రాణహర్త్రే ॥
ఓం శ్రీధరాయ ॥
ఓం క్షత్రియాంతకరామాయ ॥
ఓం మత్స్యరూపాయ ॥ 70
ఓం పాండవారిప్రహర్త్రే ॥
ఓం శ్రీకరాయ ॥
ఓం ఉపత్యకాప్రదేశస్థశంకరధ్యాతమూర్తయే ॥
ఓం రుక్మాబ్జసరసీకూలలక్ష్మీకృతతపస్వినే ॥

ఓం లసల్లక్ష్మీకరాంభోజదత్తకల్హారకప్రియే ॥
ఓం సాలగ్రామనివాసాయ ॥
ఓం శుకదృగ్గోచరాయ ॥
ఓం నారాయణార్థితాశేషజనదృగ్విషయాయ ॥
ఓం మృగయారసికాయ ॥
ఓం వృషభాసురహారిణే ॥
ఓం అంజనాగోత్రపతయే ॥
ఓం వృషభాచలవాసినే ॥
ఓం అంజనాసుతదాత్రే ॥
ఓం మాధవీయాఘహారిణే ॥
ఓం ప్రియంగుప్రియభక్షాయ ॥
ఓం శ్వేతకోలవరాయ ॥
ఓం నీలధేనుపయోధారాసేకదేహోద్భవాయ ॥
ఓం శంకరప్రియ మిత్రాయ ॥
ఓం చోళపుత్రప్రియాయ ॥
ఓం సుధర్మిణీసుచైతన్యప్రదాత్రే ॥
ఓం మధుఘాతినే ॥
ఓం కృష్ణాఖ్యవిప్రవేదాంతదేశికత్వప్రదాయ ॥
ఓం వరాహాచలనాథాయ ॥
ఓం బలభద్రాయ ॥
ఓం త్రివిక్రమాయ ॥
ఓం మహతే ॥
ఓం హృషీకేశాయ ॥
ఓం అచ్యుతాయ ॥
ఓం నీలాద్రినిలయాయ ॥
ఓం క్షీరాబ్ధినాథాయ ॥
ఓం వైకుంఠాచలవాసినే ॥
ఓం ముకుందాయ ॥
ఓం అనంతాయ ॥
ఓం విరించాభ్యర్థితానీత సౌమ్యరూపాయ ॥
ఓం సువర్ణముఖరీస్నాతమనుజాభీష్టదాయినే ॥
ఓం హలాయుధ జగత్తీర్థ సమస్తఫలదాయినే ॥
ఓం గోవిందాయ ॥
ఓం శ్రీనివాసాయ ॥
శ్రీ వేంకటేశ్వర స్వామినే నమః అష్టోత్తరశతనామపూజాం సమర్పయామి

## పద్మావతీ చతుర్వింశతి నామావళిః

ఓం శ్రీం శ్రియై నమః

ఓం శ్రీం లోకధాత్ర్యై నమః
ఓం శ్రీం బ్రహ్మమాత్రే నమః
ఓం శ్రీం పద్మనేత్రాయై నమః
ఓం శ్రీం పద్మముఖ్యై నమః
ఓం శ్రీం ప్రసన్నముఖ పద్మాయై నమః
ఓం శ్రీం పద్మకాంత్యై నమః
ఓం శ్రీం బిల్వవనస్థాయై నమః
ఓం శ్రీం విష్ణుపత్న్యై నమః
ఓం శ్రీం విచిత్రక్షౌమధారిణ్యై నమః
ఓం శ్రీం పృథుశ్రోణ్యై నమః
ఓం శ్రీం పక్వబిల్వఫలాపీనతుంగస్తన్యై నమః
ఓం శ్రీం సురక్త పద్మపత్రాభకరపాదతలాయై నమః
ఓం శ్రీం శుభాయై నమః
ఓం శ్రీం సురత్నాంగద కేయూరకాంచీనూపురశోభితాయై నమః
ఓం శ్రీం యక్షకర్దమసంలిప్తసర్వాంగాయై నమః
ఓం శ్రీం కటకోజ్జ్వలాయై నమః
ఓం శ్రీం మాంగల్యాభరణైశ్చిత్రైర్ముక్తాహారైర్విభూషితాయై నమః
ఓం శ్రీం తాటంకైరవతంసైశ్చ శోభమానముఖాంబుజాయై నమః
ఓం శ్రీం పద్మహస్తాయై నమః
ఓం శ్రీం హరివల్లభాయై నమః
ఓం శ్రీం ఋగ్యజుస్సామరూపాయై నమః
ఓం శ్రీం విద్యాయై నమః
ఓం శ్రీం బ్రహ్మరుద్రేందత్వప్రాపకకృపాదృష్టిపాతాయై నమః
ఓం శ్రీం అబ్ధిజాయై నమః

ఓం శ్రీం శ్రీపద్మావతీ దేవ్యై నమః
శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః

**పద్మావతీదేవ్యైనమః చతిర్వింశతి నామావళీ సహిత పూజాం సమర్పయామి॥**

దశాంగం గుగ్గులోపేతం సుగంధం సుమనోహరమ్।
నమస్తుభ్యం నమస్తుభ్యం గృహాణ వరదోభవ ॥

**శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః ధూపమాఘ్రాపయామి ॥**

సాద్యం త్రివర్తి సంయుక్తం వహ్నినా ద్యోతితం మయా।
గృహాణ మంగళందీపం నారాయణ నమోఽస్తు తే।

శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః దీపం దర్శయామి ॥

నైవేద్యం గృహ్యతాందేవ చణముద్గైః ప్రకల్పితాన్ ।
భక్ష్యం భోజ్యం చ లేహ్యం చ చోష్యం పానీయమేవచ
ఇదం గృహాణ నైవేద్యం మయాదత్తం కృపానిధే! ॥

**శ్రీ పద్మావతీసమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః**
**నైవేద్యం సమర్పయామి ॥**

వేంకటేశ! రమాకాంత! వరాహవదనాచ్యుత !
నారాయణ! రమాధీశ! కృపాంకురు కృపానిధే!

శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః
**సువర్ణపుష్పం సమర్పయామి ॥**

పూగీఫల సత్పూరైః నాగవల్లీ దళైర్యుతమ్ ।
కర్పూర చూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ।

శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః
**తాంబూలం సమర్పయామి ॥**

ఘృతవర్తి సహస్రైశ్చ కర్పూరశకలై స్సదా ।
నీరాజనం మయాదత్తం గృహాణవరదోభవ ॥

శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామినే నమః
నీరాజనం సమర్పయామి ॥

## క్షమాప్రార్థనం

జితంతే పుండరీకాక్ష నమ స్తే విశ్వభావన!
నమస్తేఽస్తు హృషీకేశ! మహాపురుషపూర్వజ!
జితంతే పుండరీకాక్ష వాసుదేవామితద్యుతే
రాగాదిదోషనిర్ముక్త సమగ్రగుణమూర్తయే।
నాథ జ్ఞాన బలోత్కృష్ట నమ స్తే విశ్వభావన
సంకర్షణ విశాలాక్ష సర్వజ్ఞ పరమేశ్వర!
నమస్తేఽస్తు హృషీకేశ సర్వేశ్వర జగన్మయ!
దేవ ఐశ్వర్య వీర్యాత్మక ప్రద్యుమ్న జగతాంపతే ।
స్థిత్యుత్పత్తిలయత్రాణహేతవే శక్తితేజసే
జయానిరుద్ధ భగవన్ మహాపురుష పూర్వజ!
శ్రీనివాస! జగన్నాథ! నారాయణ! దయానిధే!
కృతార్థోఽహం కృతార్థోఽహం కృతార్థాః సర్వజంతవః
ప్రసీద భగవన్ విష్ణో! ప్రసీద పురుషోత్తమ !
ప్రసీద పుండరీకాక్ష! ప్రసాదాత్మసాత్కురు ॥

## కథా సంగ్రహం

అది నైమిశారణ్యం. ఆ అరణ్యంలో సర్వకాల సర్వావస్థలందు సత్సంగం సాగుతూ ఉంటుంది. ఆ సత్సంగానికి సూతుడు నాయకుడు. అతడే వక్త. శౌనకాదులు శ్రోతలు. ఈ సత్సంగంలో అనేక దివ్యక్షేత్రాల ప్రసక్తి, దేవాధిదేవతల లీలలు

కథారూపంలో సూతుడు శౌనకాదులకు విన్నవించటం పరిపాటి. ఒకనాడు శౌనకాదులు సూతుణ్ణి చూచి

"షడ్గుణాఢ్య! నారాయణస్వరూపుడైన వేదవ్యాసుని సత్కృపతో సర్వస్వము తెలిసిన మహానుభావుడివి. త్రిమూర్తులలో హరి శ్రేష్ఠుడు కదా! ఆహరికి అండపిండ బ్రహ్మాండాది లోకాలలో ఏది ప్రియస్థలము? ఎక్కడ హరి స్వయంవ్యక్తుడుగా ప్రకాశిస్తు న్నాడు? సామాన్య మానవులు కూడా దర్శించగల క్షేత్రము ఏది? మాకు తెలియజేయగలరు" అని ప్రార్థించారు. సూతుడు శౌనకా దుల ప్రశ్నను, ఆకాంక్షను మేళవించుకుని స్థిమితకాలము ధ్యాన లోచనుడై సమాధిలో మునిగి తదనంతరము శౌనకాదులను చూచి విశదంగా వివరించగలను అని బదులిచ్చాడు.

ఒకప్పుడు సమస్తము లయమైపోయింది. మహావిష్ణువు వటపత్ర శయనుడయ్యాడు. కాలం గడచింది. శ్వేతవరాహరూపం ధరించి జలంలోనికి ప్రవేశించాడు. పాతాళంలో దాగిన రుక్మా క్షునితో సమరం సాగించి అతనిని హతమార్చాడు. పాతాళం ప్రవేశించి కోరలతో 'భూమి'ని ఉద్ధరించాడు. అప్పుడు బ్రహ్మాది దేవతలు స్తోత్రం చేసి పర్వత వనాదులతో సకల చరాచర జంతు జాలంతో 'భూమి'ని శోభితం చేయాలని ఆ స్వామిని కోరారు. శ్వేతవరాహమూర్తి సమ్మతించాడు.

వైకుంఠం నుండి క్రీడాచలాన్ని తెమ్మనమని గరుడుని ఆదేశించాడు. గరుడుడు వైకుంఠానికి వెళ్లి 3 యోజనాల వెడల్పు 30 యోజనాల పొడవున్న క్రీడాద్రిని భూలోకానికి తెచ్చాడు. ఆ క్రీడాద్రిపై విష్ణువు శ్వేతవరాహస్వామిగా నిలిచాడు. ఆస్వామి తనకు వైకుంఠంకన్నా వేంకటాచలం ప్రియమని ఇక్కడే శ్రీభూసహితుడనై నిలుస్తానని భక్తులను అనుగ్రహిస్తూ కోరిన కోరికలను తీరుస్తానని అభయమిచ్చి అదృశ్యరూపుడయ్యాడు.

ఆ స్వామియే నేడు ఆనందనిలయదివ్య విమానఛాయలో విరాజమానమగుచూ సువర్ణ చిత్రాంబరధరుడుగ, సుభగ దర్శనుడుగ, కంబుగ్రీవుడుగా, పుండరీకవిశాలలోచనుడుగా, కోమలాంగుడుగా, సురుచిర మందహాస సుందర వదనార విందుడిగా, బ్రహ్మసూత్ర విరాజితుడిగా, శంఖచక్రగదాధారిగా, జగద్రక్షకుడుగా విరాజిల్లుతున్నాడు. ఈ స్వామి సందర్శనం ఈ క్షేత్రంలో సంచారం **స్వామి పుష్కరిణీస్నానం** కోటి జన్మల పుణ్య ఫలం, మన ఈ మానవజన్మ సార్థకతకు దోహదభూతం.

**శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీతటే।**

**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥**

**వినా వేంకటేశం ననాథో ననాథః**

**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**

**హరే! వేంకటేశ ప్రసీద! ప్రసీద!**

**ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ!**

**అజ్ఞానినా మయాదోషాన్ అశేషాన్ విహితాన్ హరే।**

**క్షమస్వత్వం క్షమస్వత్వం శేషశైలశిఖామణే ॥**

## గోవింద నామావళి

శ్రీ శ్రీనివాసా గోవిందా
శ్రీ వేంకటేశా గోవిందా
భక్తవత్సల గోవిందా
భాగవతప్రియ గోవిందా
నిత్యనిర్మలా గోవిందా
నీలమేఘశ్యామ గోవిందా
పురాణపురుషా గోవిందా
పుండరీకాక్ష గోవిందా
గోవిందా హరి గోవిందా
గోకులనందన గోవిందా
నందనందనా గోవిందా
నవనీతచోరా గోవిందా
పశుపాలకశ్రీ గోవిందా
పాపవిమోచన గోవిందా
దుష్టసంహార గోవిందా
దురిత నివారణ గోవిందా
శిష్టపరిపాలక గోవిందా
కష్ట నివారణ గోవిందా ॥గో॥
వజ్రమకుటధర గోవిందా
వరాహమూర్తి గోవిందా
గోపీజనలోల గోవిందా
గోవర్ధనోద్ధార గోవిందా
దశరథనందన గోవిందా
దశముఖమర్దన గోవిందా
పక్షివాహనా గోవిందా
పాండవప్రియ గోవిందా ॥గో॥
మత్స్య కూర్మ గోవిందా
మధుసూదన హరి గోవిందా
వరాహ నరసింహ గోవిందా
వామన భృగురామ గోవిందా

బలరామానుజ గోవిందా
బౌద్ధకల్కిధర గోవిందా
వేణుగానప్రియ గోవిందా
వేంకటరమణా గోవిందా ॥గో॥
సీతానాయక గోవిందా
శ్రితపరిపాలక గోవిందా
దరిద్రజనపోషక గోవిందా
ధర్మసంస్థాపక గోవిందా
అనాథరక్షక గోవిందా
ఆపద్బాంధవ గోవిందా
శరణాగతవత్సల గోవిందా
కరుణాసాగర గోవిందా ॥గో॥
కమలదళాక్ష గోవిందా
కామితఫలదా గోవిందా
పాపవినాశక గోవిందా
పాహి మురారే గోవిందా
శ్రీముద్రాంకిత గోవిందా
శ్రీవత్సాంకిత గోవిందా
ధరణీనాయక గోవిందా
దినకరతేజ గోవిందా ॥గో॥
పద్మావతీప్రియ గోవిందా
ప్రసన్నమూర్తీ గోవిందా
అభయహస్తప్రదర్శన గోవిందా
మత్స్యావతార గోవిందా
శంఖచక్రధర గోవిందా
శార్ఙ్గగదాధర గోవిందా
విరజాతీరస్థ గోవిందా
విరోధిమర్దన గోవిందా ॥గో॥
సాలగ్రామధర గోవిందా
సహస్రనామ గోవిందా
లక్ష్మీవల్లభ గోవిందా
లక్ష్మణాగ్రజ గోవిందా
కస్తూరీతిలక గోవిందా
కాంచనాంబరధర గోవిందా

గరుడవాహన గోవిందా
గజరాజరక్షక గోవిందా ॥గో॥
వానరసేవిత గోవిందా
వారిధిబంధన గోవిందా
ఏడుకొండలవాడ గోవిందా
ఏకస్వరూపా గోవిందా
శ్రీరామకృష్ణ గోవిందా
రఘుకులనందన గోవిందా
ప్రత్యక్షదేవా గోవిందా
పరమదయాకర గోవిందా॥గో॥
వజ్రకవచధర గోవిందా
వైజయంతిమాల గోవిందా
వడ్డికాసులవాడ గోవిందా
వసుదేవతనయా గోవిందా
బిల్వపత్రార్చిత గోవిందా
భిక్షుక సంస్తుత గోవిందా
స్త్రీ పుం రూపా గోవిందా
శివకేశవమూర్తి గోవిందా ॥గో॥
బ్రహ్మాండరూపా గోవిందా
భక్తరక్షక గోవిందా
నిత్యకల్యాణ గోవిందా
నీరజనాభ గోవిందా
హాథీరామప్రియ గోవిందా
హరిసర్వోత్తమ గోవిందా
జనార్దనమూర్తి గోవిందా
జగత్సాక్షిరూప గోవిందా ॥గో॥
అభిషేకప్రియ గోవిందా
ఆపన్నివారణ గోవిందా
రత్నకిరీటా గోవిందా
రామానుజనుత గోవిందా
స్వయంప్రకాశ గోవిందా
ఆశ్రితపక్ష గోవిందా
నిత్యశుభప్రద గోవిందా
నిఖిలలోకేశా గోవిందా ॥గో॥
ఆనందరూపా గోవిందా
అద్యంతరహితా గోవిందా

ఇహపరదాయక గోవిందా
ఇభరాజరక్షక గోవిందా
పరమదయాళు గోవిందా
పద్మనాభహరి గోవిందా
తిరుమలవాసా గోవిందా
తులసీవనమాల గోవిందా ॥గో॥
శేషాద్రినిలయా గోవిందా
శేషశాయి గోవిందా
శ్రీశ్రీనివాసా గోవిందా
శ్రీ వేంకటేశ గోవిందా
గోవిందా హరి గోవిందా
గోకులనందన గోవిందా

-సర్వం శ్రీవేంకటేశ్వరార్పణమస్తు-

## శ్రీవేంకటేశ వజ్రకవచ స్తోత్రమ్

(వ్యాధి బాధల నివారణకు, ప్రమాద నివారణకు
వజ్రకవచ స్తోత్రం)

**మార్కండేయ ఉవాచ :**

ఓం నారయణం పరబ్రహ్మ సర్వకారణ కారణమ్
ప్రపద్యే వేంకటేశాఖ్యం తదేవ కవచం మమ ॥
సహస్రశీర్షాః పురుషో వేంకటేశ శ్శిరోవతు ।
ప్రాణేశః ప్రాణనిలయః ప్రాణం రక్షతు మే హరిః ॥
ఆకాశరాట్సుతానాథ ఆత్మానం మే సదావతు ।
దేవదేవోత్తమః పాయాత్ దేహం మే వేంకటేశ్వరః ॥
సర్వత్ర సర్వకాలేషు మంగాంబాజాని రీశ్వరః ।
పాలయేన్మామకం సదా కర్మసాఫల్యం నః ప్రయచ్ఛతు ॥
యదేతద్వజ్రకవచం అభేద్యం వేంకటేశితుః ।
సాయం ప్రాతః పఠేన్నిత్యం మృత్యుం తరతి నిర్భయః ॥

**ఇతి మార్కండేయకృత శ్రీవేంకటేశ్వర వజ్రకవచ స్తోత్రమ్.**

## నియమావళి

1 ప్రతి శనివారం శ్రీవేంకటేశ్వరస్వామి పూజాకల్పం ప్రతివారు విధిగా ఆచరించాలి.

2 తలస్నానం చేసి శుచిగా, శుభ్రతగా ఉండి, ఉపవాస దీక్షతో శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అలంకరించి పూజాద్రవ్యాలు సిద్ధం చేసుకోవాలి.

3 **ఓం నమో వేంకటేశాయ** అను అష్టాక్షర మంత్రాన్ని ప్రతివారు 8 వేల పర్యాయాలు జపం చేయాలి.

4 నేలపై శయనించాలి.

5 ఆవునేతితో దీపారాధన చేసి, తెల్లటి సుగంధ సంభరితాలైన పుష్పాలతో భక్తితో చిత్రపటాన్ని అలంకరించాలి.

6 ఏడు శనివారాలు విధిగా ఈ పూజాకల్పాన్ని ఆచరిస్తే సప్తాచల నివాస రసికుడైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు పరిపూర్ణముగా లభించి సర్వసౌభాగ్యాలతో కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

7 పూజాకల్పం అనంతరం ఏడుమంది సువాసినులను (ముత్తైదువులను) పూజించి వారిద్వారా గృహిణులు ఆశీస్సులు పొందాలి.

## సేవాఫలములు

- తిరుమల శ్రీవారి సుప్రభాతం అనే మేలుకొలుపు సేవలో పాల్గొంటే మన మనస్సు మేల్కొని పరంధాముని సేవకు అంకిత మవుతుంది.
- తోమాలసేవ అనగా పుష్పాలంకరణసేవ అని అర్థం. ఈ సేవలో పాల్గొన్నవారి మనస్సు అనే పుష్పం శ్రీవారి పాదాల చెంత చేరి జన్మ ధన్యమవుతుంది.
- శ్రీవారిఅర్చనలో మనస్సు ఏకాగ్రతను పొంది శ్రీవారి, పాదాల మీద కేంద్రీకరింపబడి, ఆధ్యాత్మికానందం, కలుగుతుంది.
- శ్రీవారి అభిషేకాన్ని దర్శిస్తే చాలు. భక్తుల శారీరక మానసిక రుగ్మతలు తొలగి లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుంది.
- విశేషపూజలో పాల్గొంటే భక్తులకు విశేషమైన కోరికలు సిద్ధి స్తాయి. అష్టదళపాదపద్మారాధనసేవ దర్శిస్తే చాలు. శ్రీనివాసుని కటాక్షంతో వంశాభివృద్ధి కలుగుతుంది.
- తిరుప్పావడసేవలో పాల్గొంటే చాలు. భక్తులకు అన్నం సమృ ద్ధిగా కలగడమేకాక, పాడిపంటలు వృద్ధి చెందుతాయి.
- ప్రతినిత్యం నిత్యకల్యాణోత్సవదర్శనం, కల్యాణప్రదం, నిత్య డోలోత్సవదర్శనం సత్సంతానప్రదం సౌభాగ్యప్రదం కూడా.

## శ్రీ గోవిందాష్టకమ్ - శ్రీ శంకరాచార్య విరచితమ్

సత్యం జ్ఞాన మనంతం నిత్య మనాకాశం పరమాకాశం
గోష్ఠ ప్రాంగణ రింఖణలోల మనాయాసం పరమాయాసమ్
మాయా కల్పిత నానాకార మనాకారం భువనాకారం
క్ష్మా మానాథ మనాథం ప్రణమత గోవిందం పరమానందమ్ ॥

మృత్స్నా మత్సీహేతి యశోదా తాడన శైశవ సంత్రానం
వ్యాదిత వక్త్రా లోకిత లోకాలోక చతుర్దశ లోకాళిమ్
లోకత్రయ పుర మూలస్తంభం లోకాలోక మనాలోకం
లోకేశం పరమేశం ప్రణమత గోవిందం పరమానందమ్ ॥

త్రైవిష్టప రిపువీరఘ్నం క్షితిబారఘ్నం భవరోగఘ్నం
కైవల్యం నవనీతాహార మనాహారం భువనాహారమ్
వైమల్య స్ఫుట చేతోవృత్తి వేశేషాభాస మనాభాసం
శైవం కేవలశాంతం ప్రణమత గోవిందం పరమానందమ్ ॥

గోపాలం భూలీలావిగ్రహ గోపాలం కులగోపాలం
గోపీఖేలన గోవర్ధన ధృతిలీలా విలసిత గోపాలమ్
గోభి ర్నిగదిత గోవింద స్ఫుటనామానం బహునామానం
గోపీగోచర పథికం ప్రణమత గోవిందం పరమానందమ్
గోపీమండల గోష్ఠీభేదం భేదావస్థనంద మభేదాభం
శశ్వద్గోఖుర నిర్ధూతోత్కృత ధూళీధూసర సౌభాగ్యమ్

శ్రద్ధా భక్తి గృహీతానంద మచింత్యం చింతిత సద్భావం

చింతామణి మహిమానం ప్రణమత గోవిందం పరమానందమ్

స్నానవ్యాకుల యోషిద్వస్త్ర ముపాదా యాగముపారూఢం

వ్యాదిత్సంతీరథ దిగ్వస్త్రా ఉపదాతీ రపకర్షంతమ్

నిర్ధూత ద్వయ శోక విమోహం బుద్ధం బుద్ధే రంతస్థం

సత్తామాత్ర శరీరం ప్రణమత గోవిందం పరమానందమ్

కాంతం కారణకారణ మాది మనాదిం కాల మనాభాసం

కాళిందీగత కాళీయశిరస్సు ముహుర్నృత్యంతం సుహనంతమ్

కాలం కాలకలాతీతం కలితాశేషం కలిదోషఘ్నం

కాలత్రయ గత హేతుం ప్రణమత గోవిందం పరమానందమ్

బృందావన భువి బృందారక గణ బృందారాధిత వంద్యోహం

కుందాభాసుర మందస్మేర సుధానందం సుహృదానందమ్

వంద్యాశేష మహాముని మానస వంద్యానంద పదద్వంద్వం

వంద్యాశేష గుణాబ్ధిం ప్రణమత గోవిందం పరమానందమ్

గోవిందాష్టక మేత దధీతే గోవిందార్పిత చేతా యః

గోవిందాచ్యుత మాధవ విష్ణో గోకులనాయక కృష్ణేతి

గోవిందాంఘ్రి సరోజ ధ్యాన సుధాజల ధౌత సమస్తాఘలం

గోవిందం పరమానందామృత మంతస్థం స త మభ్యేతి ॥

**30.01.2012 ఉదయం 4 గం.కు**

**రథసప్తమి పర్వదినాన**

**శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌లో...**

**సుప్రభాతం తొలి ప్రసారం**

**తిరుమల శ్రీవారి అర్చకులచే**

**ఉ. 4.45 గం.కు - శ్రీవారి నిత్యపూజావిధి**

**ఉ. 5.30 గం.కు - సూర్యప్రభ వాహనసేవ**

ప్రతి గ్రామంలోని దేవాలయం ద్వారా

ఇంటింటా శ్రీవారి పుస్తక ప్రసాదాన్ని అందుకోండి.

శ్రీనివాసుని నిత్యపూజతో సర్వశుభాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు పొందండి.

గోవిందుడు అందరివాడు

ఇదే

**'గోవిందం పరమానందం'.**